ఆదివారం
ప్రజాశక్తి
డిసెంబర్ 7, 2003



కుంటాల జలపాతం

కాఫీ కథ....

హ్యాపీ బర్త్‌డే

(7-12-2003 నుండి 13-12-2003వరకు)

పి.వి. విజయ్‌దీప్
7సం॥, 7.12.1996
జయమ్మ- విల్‌సన్
కల్వకుర్తి-మహబూబ్‌నగర్

జి. సింధు
3సం॥,-2000
క్రాంతి-రవికిరణ్
జమిస్తాన్‌పూర్ -హైదరాబాద్

నవ్య
9సం॥,-1994
శాంతి-శ్రీనివాసరావు
జమిస్తాన్‌పూర్-హైదరాబాద్

కె. శ్రావణ్య
9సం॥,7.12.1994
జయలలిత- మురగారెడ్డి
పుత్తూరు-చిత్తూరు

అంకిత
4సం॥, 7.12.1999
గౌరి-శ్రీనివాస్
అమలాపురం

ఎస్. విశ్వక్‌రెడ్డి
6సం॥, డిసెంబర్-1997
సమత-కృష్ణారెడ్డి
సంతోష్‌నగర్-హైదరాబాద్

అరవింద్
1సం॥, 8.12.2002
అరుణ-ఎల్లయ్య
పోతారెడ్డి పల్లి- మహబూబ్‌నగర్

జె.వి.పి.ఎస్.తేజ
డిసెంబర్-8
జ్యోతిశారదా-ప్రసాదరావు
యర్రగొండపాలెం-ప్రకాశం

ఎన్.నికిల్
సుశీల-రవి
చిప్పకుర్తి-కరీంనగర్



సాయికృష్ణరోహిత్
డిసెంబర్-9
రేవతి-ప్రసాదరావు

సిహెచ్. మనస్విని(మధు)
5సం॥, 9.12.1998
యమున-శ్రీనివాసరావు
ఎర్రుపాలెం-ఖమ్మం

జె. ప్రభు-చరణ్
డిసెంబర్
సుమ-రమేష్
హసన్‌పర్తి-వరంగల్

ఆర్. గీతిక
1సం॥,9.12.2002
సబిత-జగదీష్
ఖమ్మం

రీనా
2సం॥, 12.12.2001
సునీత-గోపి
అంతర్వేది-తూ॥గో॥

దనుష్‌కుమార్‌రెడ్డి
1సం॥,13.12.2002
స్వరూప-కృష్ణారెడ్డి
మలక్‌పేట-హైదరాబాద్

కె. రిషీక్
6సం॥,13.12.1997
వెంకటలక్ష్మి-వెంకటేశ్వర్లు
కూనవరం-తూ॥గో॥

పి. బాలబసయ్య(బాలు)
రమణమ్మ-బసయ్య
చెమ్ముమియ్యాపేట-కడప

ఆదిల్
వశీం బేగం-ఖలీల్
కొత్తకోట-మహబూబ్‌నగర్

సాహిత్
3సం॥, డిజెంబర్-2000
సుశీల-అబ్బయ్య
యాచారం-రంగారెడ్డి

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం

ఎన్‌సిసి సమాచారం బాగుంది

బాలలు, యువకులకు క్రమశిక్షణ, దేశభక్తి నేర్పే ఎన్‌సిసి గురించి వివరిస్తూ నవంబర్ 23వ తేదీన అనుబంధంలో ఇచ్చిన వ్యాసం చాలా బాగుంది. దేశ రక్షణకు అవసరమయ్యే త్రివిధ సాయుధ దళాల్లో చేరడానికి కూడా ఎన్‌సిసి చాలా ఉపయోగపడుతుంది. అందువల్ల విద్యార్థులంతా ఎన్‌సిసిలో చేరడం ఎంతో అవసరం. జాతికి కూడా ఉపయోగం.

వి. శ్యామ్, కాకినాడ

రచయితలకు మనవి

ఆదివారం అనుబంధంలో ప్రచురణ కొరకు కథలు పంపే రచయితలకు సూచన. కథలు పేజీకి 20 లైన్లకు మించకుండా ఐదు అరఠావుల్లో రాయాలి. పేజీకి ఒకవైపునే రాయాలి. ప్రచురణార్థం కాని కథలు తిప్పి పంపగోరువారు తగిన స్టాంపులు అంటించిన కవరు జతపరచాలి. కథలు <u>పంపవలసిన చిరునామా:</u>

సంపాదకులు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, అశోక్‌నగర్, హైదరాబాద్ 20

హృదయాన్ని కదిలించింది

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం అత్యంత విలువైన సమాచారం, వైజ్ఞానిక విషయాలతో అందిస్తున్నారు. నవంబర్ 23 ఆదివారం అనుబంధంలో ప్రచురింపబడిన పులి కళ్యాణి 'బాపూ బర్త్‌డే' కథ ఏ రకమైన అర్హతలు లేని వ్యక్తులు అడ్డదారుల్లో ఎం.ఎల్.ఏ. పదవులు చిక్కించుకొని తమ స్వార్థం కోసం పడే తాపత్రయం, ఆర్భాటం వగైరాలను ప్రస్ఫుటంగా బహిర్గతం చేసింది. ఇంతి సంగతులు శీర్షికన లక్ష్మిగారి 'తల్లీనిన్ను తలంచి' హృదయాల్ని కదిలించేలా వుండటమే గాక మానవ సమాజంలో తల్లికున్న ఉదాత్త పాత్రను వున్నతంగా చిత్రించింది. ప్రఖ్యాత సంగీత విద్వాంసుడు సెమ్మంగుడి గారి జీవన రేఖల గురించి సవివరమైన వ్యాసం అందించిన భూపాలిగారు అభినందనీయులు. మరిన్ని హంగులతో కొత్త శీర్షికలతో ప్రజాశక్తి జనరంజకం కావాలని ఆకాంక్ష.

– సువారపు చంద్రశేఖరరావు,
తిరువూరు, కృష్ణాజిల్లా.

ఆకట్టుకుంటున్న 'ఔరా!'

రాజస్థాన్ అంటేనే అపురూప నిర్మాణాలకు, కళాత్మక వైభవానికి ఎంతో ప్రసిద్ధి గాంచింది. నవంబర్ 23 ఆదివారం అనుబంధంలో రాజస్థాన్‌లోని జై సల్మేర్ కోట గురించి 'ఎడారిలో బంగారుకోట' శీర్షిక ద్వారా తెలుసుకోగలిగాం. ఆ కోటలో ఇప్పటికీ ఐదువేల మంది ప్రజలు నివశిస్తున్నారని చదివి విస్తుపోయాం. ఇటీవల వినూత్న విశేషాలతో 'ఔరా!' అనేలా చేస్తున్న 'ఔరా!' శీర్షిక మమ్మల్నెంతగానో ఆకట్టుకుంటోంది.

– బట్టా రామకృష్ణ, సౌత్‌మోపూరు
గ్రామం, నెల్లూరు జిల్లా.

ఎల్లలెరుగని మానవత్వం

ఎక్కడో నేపాల్ నుండి వచ్చి ఇక్కడ బాధలు పడుతున్న మహిళను ఆదుకున్న తీరును కళ్ళకు కట్టినట్లు రియల్‌స్టోరీ కనిపించని దేవుడులో వివరించారు. దేశం, మతం, భాష ఏదైనా మానవత్వమే ముఖ్యమని రియల్‌స్టోరీ చాటింది. ఇటువంటి మానవత్వం మూర్తీభవించిన కథనాలు ఎప్పుడూ ప్రచురించాలి. ఎన్‌సిసి గురించి ఎంతో వివరంగా చెప్పిన కవర్‌స్టోరీ బాగుంది.

– ఎన్. ఉమామహేశ్వరరావు,
రాణీగారి తోట, విజయవాడ

గమనిక

ఆదివారం అనుబంధంలో రుచి శీర్షిక మీరు చూసే ఉంటారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు వివిధ వంటకాలకు ప్రసిద్ధి. ఆసక్తి గల వారు ఆయా జిల్లాల్లో ప్రసిద్ధమైన వంటకం గురించి, దాని తయారీ విధానం గురించి రాసి పంపితే ప్రజాశక్తిలో ప్రచురిస్తాము. వంటకం ఫోటోతో పాటు రాసిన వారి ఫోటో కూడా పంపవలెను.

వంటలు పంపవలసిన చిరునామా: రుచి, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, అశోక్‌నగర్, హైదరాబాద్ 20

మనలో మాట

అప్పలకొండే బెటరు

ఎర్రబస్సెక్కి హైదరాబాదులో దిగేడు అప్పలకొండ. రెండుచేతుల్లో రెండు బ్యాగులు. వెనక చెట్టంత కొడుకు. బంధువుల ఇల్లు ఈజీగానే పట్టేశాడు. మూడురోజుల తర్వాత ఏదో అణాకాని ఆఫీసులో అబ్బాయికి ఇంటర్వ్యూ ఉందని, అప్పటిదాకా మకాం తప్పదని సూచనలు ఇచ్చేశాడు. స్నానపానాదులు గట్రా అయ్యాక ఒక బ్యాగులోంచి అడ్రసు స్లిప్పులు, పరిచయ పత్రాలు తీసుకొని కొడుకుతోపాటు బజార్లో పడ్డాడు. అత్తెసరు ఉద్యోగమయినా గట్టి రెకమండేషన్లు తగిలిస్తేగానీ లాభం లేదని ఎవరో చెప్పారట. తెలిసిన వారిదగ్గర తెచ్చిన పరిచయపత్రాలు చూపెట్టి అబ్బాయి ఉద్యోగానికి చేతనైన సాయం చేయమని ముక్కూ మొహం తెలియని వారిని అర్థిస్తూ ఆ రోజంతా చెడతిరిగేశాడు.

రెండవరోజూ అదే తంతు. రూటు మాత్రం వేరు. మొదటిరోజు ఇహలోక యత్నం. రెండోరోజు పరలోకవాసులను సంతృప్తిపరిచే ప్రయత్నం. సిటీలోని పవర్‌ఫుల్ దేవుళ్ల జాబితా, ఆ మార్గాల్లో వెళ్లే బస్ నెంబర్లు అన్నీ పకడ్బందీగా ముందే సేకరించాడు. అనుకొన్న ప్రకారం మొదట బిర్లామందిర్ వెళ్లాడు. అక్కడి నుండి సంఘీ టెంపుల్ వెళ్లాడు. తన జాబితాలో ఉన్న గుడులన్నీ చుట్టేశాడు. ఈ మధ్య జూబ్లీహిల్స్ పెద్దమ్మ పవర్ పెరిగిపోయిందని ఎవరో చెప్తే అక్కడికీ వెళ్లాడు. అదేమిటీ మధ్యలో టాంక్‌బండ్ కట్ట మైసమ్మను వదిలేశావని ఎవరో ప్రశ్నిస్తే లెంపలేసుకొని మైసమ్మ దర్శనం చేసుకొన్నాడు. చిన్నా చితకా అనుకోకుండా రోడ్డుమీద కన్పించిన ఏ గుడినీ వదల్లేదు. బంధువుల ఇంటి మలుపులో పసుపు కుంకుమలు పూసిన రావిచెట్టు కన్పిస్తే మూడుసార్లు ప్రదక్షిణ చేసిగానీ అడుగు ముందుకేయలేదు. ఏ పుట్టలో ఏ పాముందో, ఏ దేవుడికి ఏ మహాత్మ్యముందో, ఎవరిని వదిలేస్తే ఏం ఆగ్రహం వస్తుందో, అసలే రాకరాక వచ్చిన ఇంటర్వ్యూ పిలుపు. అందుకని అప్పలకొండ ఏ ఛాన్సు వదులుకోదల్చుకోలేదు.

అప్పలకొండను మించినవారు మన అమాత్యులు. ముందస్తు ఎన్నికలంటేనే వాళ్లకి ముచ్చెమటలు పట్టేస్తున్నాయి. టికెట్ వస్తుందో రాదో తెలియదు. టికెట్ వస్తే ప్రచారానికి వెళ్లగలరో లేదో తెలియదు. అన్నీ సందేహాలే. టికెట్ కోసం అధినేతను ఎలా సంతోషపెట్టాలో తెలియదు. అధినేత అనుగ్రహించినా ముక్కోటి దేవతల్లో ఎవరైనా ఆగ్రహిస్తారేమోనని భయం. వాస్తుదేవతలంటే మరీ వణుకు. సచివాలయంలో ఏమూల ఏ శక్తి తమను మింగేయడానికి కూర్చుందోనని హడలిపోతున్నారు. తమ కోసం నిర్మించిన కొత్త కార్యాలయాలు సిద్ధమయ్యాయి. అయినా అందులోకి మారాలంటే వెన్నులో వణుకు. కొత్త భవంతులు తమ భవిష్యత్తును మింగేస్తాయేమోనని చచ్చేంత సంశయం. అధినేత ఎగతాళి చేసినా, ఆగ్రహించినా మొహం తిప్పుకొంటారు తప్ప కాలు కదిపే ఆలోచన చేయరు.

అప్పలకొండది కడుపుతీపి. అమాత్యులది అధికారదాహం.
అడుగుతీసి అడుగేయాలంటే అన్నీ సందేహాలే, సంశయాలే.
అక్షరాలు రాని అప్పలకొండ అమాత్యులకంటే
ఎంతో బెటరు.

ఈ సంచికలో . . .

కనదగు నెవ్వరు గీచిన... . . . 4
ఓరా! . . . 5
కవర్ స్టోరీ . . . 6
జీవనశైలి . . . 10
బాలల కథ . . . 11
బాలనేస్తాలు . . . 12
ఇంతిసంగతులు . . . 16
కచేరి . . . 17
పుస్తక పరిచయం . . . 20
టూరిస్ట్ గైడ్ . . . 21
న్యాయసలహాలు . . . 24

ఇంకా...

రెండు అంతర్లోకాలు
కథ ... 9

మిరప వీరుడు
రియల్‌స్టోరీ . . . 14

దంతాల ఆరోగ్యమే మన ఆరోగ్యం
ఆరోగ్యం . . . 18

పిల్లల పుస్తకాలు రాసే పెద్దరచయిత సర్వేశ్వర శర్మ
కళాసాహితి . . . 22

శ్రీ నారా చంద్రబాబునాయుడు

శ్రీ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి

శ్రీ వెంకయ్య నాయుడు

మనమద్దతు ఎవరికి?

ఈరోజు మీరు తీసుకునే నిర్ణయమే రేపు మన భవిష్యత్తు.

THE RURAL MEDICAL PRACTITIONERS ASSOCIATION

(GOVT. REGD.NO.3812/1996)

రూరల్‌మెడికల్ ప్రాక్టీషనర్స్‌కు శుభాభివందనములు.....

ఈ అసెంబ్లీఎలక్షన్‌టైమ్‌లో టి.డి.పి, కాంగ్రెస్, బి.జే.పి మరియు కమ్యూనిస్టు పార్టీలు, ఎవరికి సపోర్టు ఎంతవరకు ఉంటుందో వెతుకులాడుకుంటున్నారు. భవిష్యత్తులో మన safety కొరకు ఈసారైనా ప్రభుత్వ గుర్తింపు పొందుటకై నిర్ణయం తీసుకొనుటకు ఇది మంచి సమయం. రాష్ట్రప్రజలకు గ్రామీణప్రాంతాలలో 80శాతం, పట్టణప్రాంతాలలో 30శాతం వరకు మనము వైద్యసేవలను అందిస్తున్నాము. మననుండి ఈవైద్యసేవలు పొందుతున్న వారిలో కనీసం సగభాగం ప్రజలచే మనం బలపరిచే వ్యక్తికిగాని, లేక పార్టీకిగాని ఓట్లు వేయించగలము. కావున ఈసువర్ణ అవకాశాన్ని వినియోగించుకుని మన సహకారంపొంది ఎమ్మెల్యేల ద్వారా చట్టసభలలో మన గుర్తింపుకొరకు జి.ఓ. పాస్‌చేయించుకునే వీలు ఉంది. అంతేకాక ప్రజలలో మంచి following ఉంది అనుకున్న senior R.M.P.లకు కార్పోరేషన్‌చేర్మెన్ పదవులు పొందుటకు వీలు ఉంటుంది. ప్రస్థుతం మన ఆంధ్రప్రదేశ్‌లో R.M.P.,P.M.P.,A.P.M.P. Welfare Association, M.A.M.S.,First Aid Association పేర్లతో మెంబర్‌షిప్‌ఫీజు వసూలుచేసి, నెలకు ఒకమీటింగ్ పెడుతూ టైంపాస్‌చేశారేకాని, ఇంతవరకు ప్రభుత్వం నుండి ఏవిధమైన గుర్తింపు పొందలేదని మనసీనియర్ గ్రామవైద్యులందరికీ తెలుసు. కావున లోకల్‌గా మాఅసోసియేషన్ గొప్పఅంటే, లేదు మాదిగొప్పఅనే ఇగోఫీలింగ్ వదలి అన్ని అసోసియేషన్ల పెద్దలు ఒకే కప్పుక్రిందకు కలసివచ్చి ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోగలరు.

ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకొవటానికి మార్గాలు :-

1. పైన ఫోటోలు ఉదహరించిన పార్టీలకు కొన్ని నియోజకవర్గాలలో గట్టిపోటీ ఉంది. ఆ నియోజకవర్గాలలో ఏవి అనేది మన ఎగ్జిక్యూటివ్‌బాడీ పెద్దలు నిర్ణయిస్తారు. 2. ఆపోటీవున్న నియోజకవర్గాలలో మనము బలపరిచిన అభ్యర్థి గెలుపొందే అవకాశం ఉంది.

మనము ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాకేంద్రాలలోని **R.&.B** గెస్ట్‌హౌస్‌ల వద్ద సమావేశమయి జిల్లాలవారీగా ఎగ్జిక్యూటివ్ బాడీస్‌ని ఏర్పాటు చేసుకుని ఫైనల్‌గా హైదరాబాద్‌లో స్టేట్‌వైస్ ఎలక్ట్రోల్‌బాడీని ఎన్నుకొంటాము. జిల్లాకేంద్రాలలో ఎగ్జిక్యూటివ్‌బాడి ఎలక్షన్‌లో ఓటుహక్కు వినియోగించుటకై ఐక్యకార్యచరణకమిటీ నుండి ఫోటో గుర్తింపు కార్డు పొందవలెను. ఈప్రకటన వెలువడిన పదిరోజులలోపు (1)మూడు స్టాంపుసైజ్‌ఫోటోలు, (2) మీవైద్యసేవలు అందిస్తున్న ప్రజలనుండి వీలైనన్ని సంతకాలు(అడ్రుస్సులతో సహా) సేకరించిన పేపర్లు, (3) ఈపేపరు ప్రకటనలు మరియు కార్యాచరణ కమిటీ జిల్లా కేంద్రాల్లో లోకల్‌బాడీలను ఏర్పాటు చేసేందుకు మరియు ఐడెంటికార్డుల ప్రింటింగు కొరకు, మీకు ఐడెంటికార్డులు పంపే పోస్టుఖర్చుల నిమిత్తము ప్రతి గ్రామీణ వైద్యుడు ముఖ్యంగా జిల్లా ఎగ్జిక్యూటివ్‌బాడీలో కంటెస్టు చేయదలచిన సభ్యులు వీలైనంత డొనేషన్‌ను పంపవలెను. డోనేషన్ పంపలేని సభ్యులకు ఐడెంటికార్డులు వి.పి.ఎల్‌లో పంపబడుతాయి. (4) రేపు ప్రభుత్వ ఎన్‌రోల్‌మెంట్ కొరకు ఈఐడెంటికార్డులు అవసరమవుతాయి.

Note: మీరు పంపే డొనేషన్లు THE RURAL MEDICAL PRACTITIONERS ASSOCIATION OF NDIA పేరులో హైదరాబాదులో చెల్లేవిధంగా డి.డి.లు మాత్రమే అంగీకరించబడును.

ఐడెంటికార్డుల కొరకు ఇతర వివరములకు :

కన్వీనర్,
పోస్టుబాక్సు నెం.37, మదనపల్లి-517325
సెల్‌నెం. 9440269517

ఇట్లు

ఐక్యకార్యాచరణ కమిటి

హైదరాబాదు.

కనదగు నెవ్వరు గీచిన...







ఓరా!



ఆత్మహత్యలు!

మన దేశంలో ఏటా 30 లక్షల మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారట! ఈ సంఖ్య 2020 నాటికి 70 లక్షలకు చేరుకుంటుందని హృద్రోగ నిపుణులు చెబుతున్నారు. ఇదేమిటి భారతీయులు ఇంత సంఖ్యలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఎప్పుడూ చదవలేదే అని ఆశ్చర్యపడుతున్నారా? నిజానికి ఇవి ఆత్మహత్యలు కాదు తిండి విషయంలో నిర్లక్ష్యంగా ఉండే భారతీయులు గుండె పోటు తెచ్చుకుని ఏటా ఇంత సంఖ్యలో చనిపోతున్నారట? దీనికి అమెరికాకు చెందిన వైద్యుల సంస్థ ఒకటి ఆత్మహత్యలు అని పేరుపెట్టింది. ఈ ఆత్మహత్యలు తగ్గాలంటే మనం నెయ్యి, గుడ్లు, పాలు, పెరుగు, ఆలూ చిప్స్, చికెన్ వంటివి తినరాదని ఆ వైద్యుల సంస్థ సలహా ఇచ్చింది! ఇవన్నీ తినడం మానేస్తే ఇంకేంటి తినేది గడ్డి?

దొంగా పోలీస్ ఆట!

దేశ రాజధాని ఢిల్లీలో అన్ని రకాల నేరాలు పెరిగిపోతున్నాయని, పోలీసులు అసమర్థులుగా తయారయ్యారని ఇటీవలి కాలంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దోపిడీలు పెచ్చరిల్లిపోయాయి. దీంతో తమపై పడ్డ మచ్చ చెరిపేసుకోవాలని ఢిల్లీ నగర పోలీస్‌కమీషనర్ గారు తీవ్రంగా ఆలోచించి ఒక కొత్త వ్యూహం రూపొందించారట! సాధారణంగా రోడ్లపై గస్తీ కాసే పోలీసులు, పోలీస్ అని రాసిఉన్న వాహనంలో, భుజాన పెద్ద తుపాకులు పెట్టుకుని యూనిఫాంలో తిరుగుతారు. అలాకాకుండా మామూలు వాహనాల్లో, సివిల్ డ్రస్సుల్లోనే గస్తీ కాయాలని ఆవిధంగా దొంగలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవచ్చన్నది ఆయనగారి ఆలోచనట! ఇదెంతవరకు ఫలితాలనిస్తుందో మరి?

కుక్కలకు జిమ్!

మనుషులకే తినడానికి తిండి లేక ఆకలిచావులు చస్తుంటే చిలీలో డబ్బులెక్కువైన వారి పెంపుడు కుక్కల దేహదారుఢ్యానికి జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నారట! అంతేకాకుండా కుక్కల అందాన్ని మెరుగుపరచడానికి, కుక్కల ఎగ్జిబిషన్లకు సిద్ధం చేయడానికి, జిమ్‌ల్లో శిక్షణ ఇవ్వడానికి గాను శిక్షకులకు శిక్షణకూడా ఇస్తున్నారట! పెంపుడు కుక్కల యజమానులకిచ్చే శిక్షణకు ఒక్కో క్లాసుకు 66 పౌండ్లు వసూలు చేస్తున్నారట! డబ్బులెక్కువైతే ఏం చేస్తారు మరి?



కోర్టు-ఎలుగు

కర్నాటకకు చెందిన జమీర్‌షా రెండు ఎలుగుబంటి పిల్లలను ఆడిస్తూ, ఊర్లవెంట తిరుగుతూ వచ్చిన డబ్బులతో కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. అలా తిరుగుతూ 1999లో పొరపాటున తమిళనాడులోని రామనాథపురం వెళ్ళి తన ఎలుగులతో ప్రదర్శన ఇచ్చాడు. అది చూసిన జంతువుల హక్కుల సంఘం వారు ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంకేం కేసు కోర్టుకు వెళ్ళింది. ఈ నవంబర్‌లో ఎలుగు పిల్లలతో సహా కోర్టుకు హాజరు కావాలని కర్నాటకలో ఉన్న జమీర్‌కు నోటీస్ వెళ్ళింది. అంతదూరం నుండి కోర్టుకు రావడానికి ఛార్జీలకు డబ్బు లేక వాటితో పాటు నడుచుకుంటూ ఆరు నెలలకు రామనాథపురం చేరుకున్నాడు. కేసును డిసెంబర్‌కు వాయిదా వేస్తున్నట్లుగా కోర్టు తెలపడంతో అంతవరకు ఎలా బతకాలో తెలియక జమీర్ తలపట్టుకున్నాడట. ఇంకేం చేస్తాడు వాటిని ఆడిస్తూ, వచ్చిన డబ్బులతో కాలం వెళ్ళబుచ్చడమే కదా మార్గం!

✻ ఇ.వి.బాలాజీ

కాఫీ కథ......

ఉదయం లేవగానే కాఫీ అంటూ గోలచేయని భారతీయుడు ఉండకపోవచ్చు... రోడ్డు మీద ఇద్దరు మిత్రులు కలిస్తే వెంటనే గుర్తుకు వచ్చేది కాఫీ హోటల్... ఇంటికి స్నేహితులు వచ్చినా, బంధువులు వచ్చినా మంచినీళ్ళతో పాటు వెంటనే ఇచ్చేది కాఫీ మాత్రమే.. ఈ విధంగా మన జీవితంలో కాఫీ ఒక భాగంగా మారిపోయింది. అటువంటి కాఫీ పుట్టింది మన దేశంలో కాదంటే ఆశ్చర్యంగా ఉంది కదూ? చరిత్రలో ఎన్నో గొప్ప పరిశోధనలన్నీ అనుకోకుండా జరిగినవే. అత్యంత సామాన్యులు కనుగొన్నవే. కాఫీ కూడా అంతే!

చీకటిఖండంగా ఒకనాడు ప్రపంచమంతా పిలిచిన ఆఫ్రికాలోని మారుమూల దేశమైన ఇథియోపియాలో ఒక గొర్రెలకాపరి కనుగొన్న కాఫీ ఈనాడు ప్రపంచ ప్రజల దైనందిన జీవితంలో భాగమైంది. ఆఫ్రికా నుండి అరేబియా అక్కడి నుండి ఐరోపా... బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ద్వారా ఆసియాలోని వలస దేశాలకు... ఇలా కాఫీ ప్రపంచమంతా వ్యాపించింది.

యూరప్ దేశాల్లో ఎంతో ప్రాచుర్యం పొందిన కాఫీక్లబ్బులు ఎన్నో ప్రజా ఉద్యమాలకు కూడా వేదికలయ్యాయి. అమెరికాలోని అనేక ప్రాంతాల్లో ఉదయం వేళ అల్పాహారంలో ఆల్కహాల్‌కు బదులుగా కాఫీ తీసుకోవడం కూడా రెండు వందల సంవత్సరాల క్రితమే ఆరంభమైంది. ఈరోజున ప్రపంచదేశాల్లో 5400 కోట్ల డాలర్ల మేర కాఫీ వ్యాపారం జరుగుతోంది. మనదేశం నుండే ఏటా 245 కోట్ల రూపాయల కాఫీ ఎగుమతి జరుగుతోంది.

కాఫీ చరిత్ర

కాఫీ కనుగొని ఇప్పటికి 1150 సంవత్సరాలైందని చరిత్ర చెబుతోంది. క్రీస్తు శకం 850లో ఇథియోపియాలో ఒక గొర్రెలకాపరి తాను మేపుతున్న గొర్రెలు చెర్రీపళ్ళు లాంటివి తిని ఎంతో హుషారుగా గెంతులు వేయడాన్ని గమనించాడు. అయితే అవి చెర్రీలు కావు. ఈ విషయాన్ని ఆ గొర్రెలకాపరి గ్రామంలోని మతపెద్దలకు చెప్పాడు. అవి దెయ్యం పళ్ళు అని తొలుత కాపరిని మందలించిన పెద్దలు ఆ తర్వాత వాటిని నీళ్ళలో ఉడకబెట్టగా వచ్చిన రసాన్ని సేవించి ఎంతో శక్తివచ్చినట్లు భావించారు. కాఫీలో మనిషికి శక్తినిచ్చే గుణం ఉందని కనుగొన్నారు. అప్పటి నుండి దీనిపై పరిశోధనలు ప్రారంభమయ్యాయి. ఆదరణ పెరిగింది. ఈ విధంగా ఇథియోపియాలో కనుగొన్న కాఫీ గురించి, ఆ చెట్టు గురించి క్రమంగా ఆఫ్రికా ఖండమంతా ప్రచారం జరిగింది. దీనికి దాదాపు 150 సంవత్సరాలు పట్టింది. 1100 సంవత్సరంలో అరబ్‌దేశాలకు దాని వినియోగం గురించి తెలిసింది. ఆ తర్వాత 1600 సంవత్సరంలో వెనిస్ ఓడరేవు ద్వారా యూరప్ దేశాల్లో అడుగుపెట్టింది. ఐరోపా దేశస్తులు కాఫీలోని సుగుణాలనెన్నింటినో కనిపెట్టారు. కొందరు వైద్యులయితే కాఫీ సర్వరోగ నివారిణిగా కూడా భావించారు. తమ దేశాల్లో కాఫీ క్లబ్బులను ప్రారంభించారు. విపరీతంగా కాఫీ తాగడం ప్రారంభించారు. దానికి ప్రచారం కూడా బాగా ఇచ్చారు. తమతో పాటు తమ దురాక్రమణలో



కాఫీ గింజలు

ఉన్న దేశాలకు తీసుకుపోయారు. ఈ విధంగా అనేక దేశాల్లో వలసపాలన నెలకొల్పిన ఫ్రెంచ్, ఇంగ్లీషు, డచ్ దేశీయుల ద్వారా దక్షిణాసియా దేశాలకు పాకింది. దాదాపు 400 సంవత్సరాల క్రితం భారతదేశంలోని తమిళనాడులో తొలిగా కాఫీ పంట పండించడం ప్రారంభమైంది. ఆ తర్వాత కేరళ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా ప్రాంతాలకు విస్తరించింది. ప్రస్తుతం ప్రపంచంలో అత్యధిక ఆదరణ పొందిన పానీయం కాఫీ మాత్రమే. 1995 లెక్కల ప్రకారం ఏటా 40 వేల కోట్ల కప్పుల కాఫీని ప్రజలు తాగుతున్నారు. కాఫీ సేవించితే ఆరోగ్యానికి హాని చేస్తుందా లేక మంచి చేస్తుందా అనే విషయంపై ప్రపంచవ్యాప్తంగా దశాబ్దాల తరబడి తర్జనభర్జనలు జరుగుతునే ఉన్నాయి. కాఫీలో కెఫిన్ అనే విష పదార్థం ఉంటుంది దాన్ని సేవించితే అనేక విధాల నష్టం కలుగుతుందని కొందరు శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. అయితే ఉదయం లేవగానే ఒక ఒకప్పు కాఫీ తాగితే ఆ రోజంతా ఎంతో ఉత్సాహంగా ఉంటారని ఇటీవల పోర్చుగల్ శాస్త్రవేత్తలు ప్రకటించారు. కాఫీలోని 'కెఫిన్' అనే పదార్థమే దీనికి కారణమని వారంటున్నారు. దీనివల్ల జ్ఞాపకశక్తి బాగా ఉంటుందని మెదడు చురుగ్గా పనిచేస్తుందని పోర్చుగల్ శాస్త్రవేత్తల అభయం. అంతేగాకుండా కెఫిన్ చర్మ కాన్సర్ రాకుండా కూడా రక్షిస్తుందని వారు సెలవిస్తున్నారు. అయితే కాఫీ అతిగా సేవించితే రక్తపోటు పెరుగుతుందని మన దేశంలోని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. కాఫీ వల్ల కలిగే నష్టాలు, లాభాల మాట ఎలా ఉన్నా శాస్త్రవేత్తలు ఏమి చెబుతున్నప్పటికీ ఏటా ప్రపంచవ్యాప్తంగా కాఫీ వినియోగం పెరుగుతూనే ఉంది. సాగు విస్తీర్ణం పెంచడానికి, దిగుబడులు పెరగడానికి ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి.

కాఫీ 60 రకాలు

ఆఫ్రికా ఖండంలో 60 రకాల కాఫీ చెట్లు ఉన్నాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా ఈ రోజున కేవలం 10 రకాల కాఫీలనే పండిస్తున్నారు. భారత్‌లో అయితే కేవలం రెండు రకాలే ఎక్కువగా పండిస్తున్నారు. కాఫీ చెట్టు బాగా ఎదిగితే 10 నుండి 12 మీటర్ల వరకు పెరుగుతుంది. కానీ సాధారణంగా 3 నుండి 5 మీటర్ల వరకే ఎదుగుతుంది. ప్రపంచంలో వాణిజ్యపరంగా కాఫీని పండించే దేశాల్లో అరబికా, రొబస్టా రకాలనే ఎక్కువగా పండిస్తున్నారు. అరబికా రకం కాఫీ చెట్లను అరబ్‌దేశాల్లో కనుగొనడంతో ఆ పేరుతోనే పిలుస్తున్నారు. నాలుగింట మూడువంతుల ప్రపంచం కాఫీ ఈ రకం చెట్లనుండే వస్తోంది. రెండోదైన రొబస్టా 1898లో ఆఫ్రికాలోని కాంగోలో కనుగొన్నారు. ఇది కూడా క్రమంగా ప్రపంచమంతా విస్తరిస్తోంది. మనదేశంలో కూడా ఈ రెండు రకాల మొక్కలనే పెంచుతున్నారు. కాఫీ మొక్క మూడు నుండి నాలుగు సంవత్సరాలు పెరిగిన తర్వాతనే పళ్ళను ఇస్తుంది.

8.5 లక్షల ఎకరాల్లో సాగు

భారతదేశంలో ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాల్లోనే కాఫీ సాగవుతోంది. తమిళనాడులో

58 వేల టన్నుల కాఫీ

హాంఫట్

1991లో 55 వేల టన్నుల కాఫీని స్వదేశంలో వినియోగించినట్లు లెక్కలు చెబుతున్నాయి. 2వేల సంవత్సరంలో మనదేశంలో కాఫీ వినియోగం 58 వేల టన్నులకు పెరిగింది.

2002-03 ఆర్థిక సంవత్సరంలో వేసిన అంచనాల ప్రకారం దాదాపు 50 దేశాలకు మనం కాఫీ ఎగుమతి చేస్తున్నాము.

53 వేల మెట్రిక్ టన్నుల కాఫీ ఎగుమతి చేసిన భారతదేశం 245 కోట్ల రూపాయల విదేశీమారకద్రవ్యం ఆర్జించింది. భారతదేశంలో కాఫీ సహజ సిద్ధమైన వాతావరణంలో పండిస్తున్నందువల్ల ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్ క్రమేపీ పెరుగుతోంది. ప్రధానంగా ఇటలీ, జర్మనీ, రష్యా, స్పెయిన్, బెల్జియం, స్లోవేనియా, అమెరికా, జపాన్, గ్రీస్, నెదర్‌ల్యాండ్స్, ఫ్రాన్స్, స్విస్ తదితర దేశాలకు మనదేశం కాఫీ ఎగుమతి చేస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లో పెరుగుతున్న కాఫీ సాగు

ఒకప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి దిగుబడి అయ్యే కాఫీ పొడి గత కొన్నేళ్ళుగా మన రాష్ట్రంలోనే తయారవుతోంది. కాఫీ పండించే ప్రాంతాల విస్తీర్ణం తూర్పుగోదావరి, విశాఖ జిల్లాల్లో పదివేల హెక్టార్లకు పైబడి ఉంది. మరోపదివేల హెక్టార్లు ఇందుకోసం సిద్ధం చేస్తున్నారు. యాభైవేల మంది గిరిజన కుటుంబాలు ఈ పెంపకం ఆధారంగా జీవనం గడుపుతున్నారు. విశాఖపట్నం ఏజన్సీలో రాఘవేంద్రనగర్‌లో ఒక పరిశోధనా కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్రానికే తలమానికంగా ఉన్న ఈ కేంద్రానికి 200 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ కేంద్రానికి అనుబంధంగా వందమంది సిబ్బందితో ఒక ప్రయోగశాల కూడా ఏర్పాటు చేసింది. ఇతర ప్రాంతాలతో సమానంగా ఇక్కడ రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా దిగుబడి సాధించలేకపోతున్నారు. కాఫీ సాగులో సరైన యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ, సస్యరక్షణ చర్యలు వంటి విషయాలపై



గిరిజనులకు అవగాహన ఉండటం లేదు. వీరిని చైతన్యం చేయడానికి ఈ పరిశోధనా సంస్థ కృషి సాగిస్తోంది.

భారతదేశంలో కాఫీ తోటలను పండించే ప్రాంతాలను రెండు రకాలుగా విభజించారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలు మొదటి నుంచి సాగు చేస్తున్నందున సాంప్రదాయక ప్రాంతాలుగా గుర్తించారు. ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా. మధ్యప్రదేశ్ రాష్ట్రాలను సాంప్రదాయేతర ప్రాంతాలుగా గుర్తించారు. ఈ సాంప్రదాయేతర ప్రాంతాల్లో ఆధునిక పద్ధతుల్లో అధిక దిగుబడి సాధించడానికి సాగు విస్తీర్ణం ఎక్కువగా పెంచడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా విత్తన' తయారీ, యాజమాన్య పద్ధతులు ఇతర విషయాలపై రాఘవేంద్రనగర్‌లో ప్రాంతీయ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ కేంద్రం ఏర్పాటైన సమయంలో నామమాత్రంగా రెండు వేల హెక్టార్లలో కాఫీ సాగు జరుగుతుండగా ప్రస్తుతం ఈ విస్తీర్ణం పదిరెట్లు పెరిగిపోయింది.

అంతర పంటలు

కాఫీ తోటల్లో కేవలం కాఫీయే కాకుండా అరటి, కొబ్బరి, అనాస, జామ, కమలా, బత్తాయి, నిమ్మ వంటి వివిధ రకాల ఫల వృక్షాలను అంతర పంటలుగా పండించడానికి ఈ పరిశోధనా స్థానం కృషి ప్రారంభించి విజయం సాధించింది. ప్రపంచంలో మరే దేశంలోనూ ఈ విధంగా అంతరపంటలు సాగుచేయడం లేదు.

పరిశోధనతో పెరిగిన దిగుబడులు

రాఘవేంద్రనగర్ కాఫీ పరిశోధనా కేంద్రంలో మారుతున్న వాతావరణ పరిస్థితుల కనుగుణంగా జీన్‌బాంక్ పరిశోధనలు అమలు చేశారు. ఆఫ్రికా, మైసూరు ప్రాంతాల నుంచి సేకరించి తెచ్చిన పలు రకాల కాఫీ మొక్కలు ఇక్కడ ఏ విధంగా దిగుబడినిస్తాయో పరిశోధన నిర్వహించారు. తెగుళ్ళను ఏ మేరకు తట్టుకుంటాయో అధ్యయనం చేశారు. దీనిపై అరాబికా రకం అనుకూలమైనదిగా గుర్తించారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో సాగవుతున్న కాఫీ తోటల కన్నా గిరిజనులు సాగు చేస్తున్న తోటల్లో దిగుబడి తక్కువ వస్తోంది. ఇందువల్ల అరాబికా రకాన్ని ప్రవేశ పెట్టారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక ప్రాంతాల్లో హెక్టారుకు 1500 కేజీల దిగుబడి వస్తుండగా మన రాష్ట్రంలో హెక్టారుకు 700 నుంచి 800 కిలోల మాత్రమే దిగుబడి వస్తోంది. గిరిజన రైతులు పండిస్తున్న తోటల్లో కేవలం 300 కిలోల దిగుబడి కూడా రావడం లేదు. నిర్ణీత సమయంలో కలుపుతీత, ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగించాలి. ఇవి కష్టం అవుతున్నందున గిరిజనుల ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా అరాబికా ప్రవేశ పెట్టారు. ఏజెన్సీ వాతావరణానికి అనుకూలంగా ఉండడం, తెగుళ్ళ నుంచి రక్షణ పొందే శక్తి ఉండడం ఈ రకం ప్రత్యేకత. అధికారుల పరిశోధనల కారణంగా ఈ రకం కాఫీ తోటలు ఏజెన్సీలో విస్తారంగా సాగవుతున్నాయి.

- పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

ప్రారంభమైన ఈ సాగు కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు విస్తరించింది. ఈ మూడు రాష్ట్రాల్లో కాఫీ సాగు చాలా సహజసిద్ధ వాతావరణంలో చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలకు చాలా ఆలస్యంగా వచ్చింది. ప్రస్తుతం మొత్తం 8.5 లక్షల ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. ఏటా 3 లక్షల టన్నుల కాఫీ దిగుబడి వస్తున్నది. ఈ తోటల్లో 98 శాతం వరకు 25 ఎకరాలలోపు కమతాలే.

5400 కోట్ల వ్యాపారం

ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం 5400 కోట్ల డాలర్ల కాఫీ వ్యాపారం జరుగుతోంది. 1990 సంవత్సరంలో ఈ వ్యాపారం 3000 కోట్ల డాలర్లే. ఆనాటి వ్యాపారంలో కాఫీ రైతుల వాటా వెయ్యి కోట్ల డాలర్ల వరకు ఉండేది. ప్రస్తుతం మొత్తం వాణిజ్యం దాదాపు రెట్టింపు పెరిగినా అందులో రైతుల వాటా మాత్రం 10 శాతమే పెరిగి 1100 కోట్ల డాలర్లయింది. పది సంవత్సరాల్లో మొత్తం వాణిజ్యంలో రైతుల వాటా 33 శాతం నుండి 11 శాతానికి పడిపోయింది. రైతుల శ్రమను బహుళజాతి సంస్థలు ఎంతగా దోపిడీ చేస్తున్నాయో ఈ అంకెలే చెబుతాయి.

ప్రపంచ కాఫీ మార్కెట్‌పై పెత్తనం చేస్తున్న అమెరికా, ఐరోపా దేశాల కంపెనీలు కాఫీ పండించే రైతులను దివాళా తీయిస్తున్నాయి. అనేకమంది కాఫీ రైతులు ఈ పంటను వదిలేస్తున్నారు. తోటల్లో పనిచేసే కూలీలు పొట్టచేత పట్టుకుని పట్టణాలకు వలసపోతున్నారు. ఈ ఏడాది కాఫీ కి వందేళ్ళలో అతి తక్కువ ధర పలికిందని, బహుళజాతి సంస్థల పెత్తనం, లాభాపేక్షే దీనికి కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ●

* జయంతి పాపారావు

రెండు అంతర్లోకాలు

రెండు అంతర్లోకాలు... ఒకరి అంతర్లోకంలోకి మరొకరు చూస్తూ చూస్తూ... వెదుకుతూ వెదుకుతూ.... ఒకడు పాత పేపర్లు కొనే గాజుల రమేష్. రెండోవాడు పారిశ్రామిక వేత్త భూమేంద్ర.

✦✦✦

విశాఖపట్నం. విశాలమైన భవనం. ఉదయం పది గంటలు. ఇంటిముందు చుట్టూ పూలకుండీలు. చల్లనిపూల కుండీల మధ్య తిరుగుడు కుర్చీలో భూమేంద్ర. కొడుకులు ఫ్యాక్టరీలకి వెళ్ళిపోయారు. పిల్లలు స్కూళ్లకి వెళ్ళిపోయారు. భార్యా, కోడళ్ళూ పనివాళ్ళ చేత పనులు చేయిస్తున్నారు. అర్నెల్ల నుండి వార్తాపత్రికలు పేరుకుపోయాయి. అమ్మేయాలని భూమేంద్ర రమేష్‌ని పిల్చాడు.

'ఎలాగ?....'

'తెలుగు పావలా... వింగ్లీషు ముప్పై అయిదు...'

'ఎలగిస్తరేటి?...'

'ముప్పైఅయిదూ... నలభై అయిదూ...'

ముప్పై... నలభై... పెద్దోరు, మీతో బేరవేటి?...'

'తీసుకో... తీసుకో...'

'సిన్నపేవర్లు వనికిరావు... తోసిపక్కనెడతా,... తలకాయలన్నీ పేరుస్తా... మీముంగలే సేత్తా.... తలకాయలునెక్కెట్టి డబ్బులిస్తా..'

భూమేంద్ర మాట్లాడలేదు. తల కదిపేడు. రమేష్ మెట్ల కిందనున్న పేపరు కట్టలు తెస్తున్నాడు.

'సూసినావా! ఈ బాబు ఒవులు?! కోట్లు కోట్లు వున్నోడు! పనికిరాని పేవర్ల కాడకూడా బేరవాడుతున్నాడు. పైసాకూడా ఒగ్గనేదు! రమేష్‌గోడు పేదోడు! నోరుసించుకుంతా వింటింటికీ తిరుగుతున్నోడు.... కాళ్ళు అరిగిపోయే ఈధిఈధికీ తిరుగుతున్నోడు... ఈడికి అయిదుపైసలొగ్గేపోతే వెలగబతుకుతాడు?... ఆకనికారం ఈ బాబుకి నేదు! కాణీయే కావాల కానీ కనికరవక్కర్లేదు!...' అని అనుకుంటూ రవేష్ వత్రికల తలకాయలు వేరుచేస్తున్నాడు.

తిరుగుడు కుర్చాలో కూర్చొని భూమేంద్ర సముద్రం వైపు చూస్తున్నాడు.

'రమేష్! నువ్వు నావైపు నాలోకి కసిగా కోపంగా చూస్తున్నావు! అయిదు పైసలు కూడా ఒగ్గలేదని అలా చూస్తున్నావు! అంతేకదా! నెనెవణ్ణి?! సముద్రం! సముద్రం ఏం చేస్తుంది?! నదులొచ్చి తనలో కలుస్తాయని వానచినుకుల్ని ఒగ్గేస్తుందా?! నది ఎలా అయింది? ప్రవాహం ఎలా అయింది? సముద్రం ఎలా అయింది? వానచినుకుల్తోనే కదా! నేనూ అంతే! పైసలని ఒగ్గేస్తే, కోట్లు కోట్లు ఎలా కూడుతుంది?! చెమట చినుకుల్ని కొల్లగొడితే కానీ కోట్లుకోట్లు కూడుతుంది?!..." అని భూమేంద్ర మనసులో అనుకుంటూ రమేష్‌లోకి చూస్తున్నాడు.

రవేష్ చిన్న చిన్న పేవర్లన్నీ ఒకచోట పడేస్తున్నాడు. పత్రికల తలకాయలు ఒకచోట పేరుస్తున్నాడు.

'... ఈ బాబేటి వలగనూత్తన్నాడు. దొంగ సూవులు దొంగలేసూత్తా రనుకున్నా! ఈ బాబు కూడా దొంగసూపు సూత్తన్నాడు! నేను సేత్తున్న దొంగపని పసిగట్టేసి నాడంటే, టపటప



నాగించేస్తాడో ఏటో!? నానెంత దగా సేయగల్ను? అయిదు రూపాయలు సేయగల్ను! పదిరూపాయలు సేయగల్ను? వంతే! ఈ బాబైతే కోట్లు కోట్లే! సిన్నోడు సేత్తే దగావంటారు... మోసమంటారు... నేరవంటారు.... ఈ బాబులు - పెద్దోరు. సేత్తే, ఏపారవంతారు... అభివృద్ధివంతారు! గాజుల రమేష్‌గోడు ఒవులు? సిత్తుకాగితాలూ, పాతపేపర్లూ కొనడం.. కవర్లు సేయడం... సావుకోర్లకి వమ్మడం... పదేళ్ళ కాణ్ణుంచీవిదే పని! ఇప్పుడీ పని కూడా పడిపోనాది. పోల్తీను కవర్లు ఒచ్చేసి నాక ఇకఇయ్యి ఒవుళ్ళు కొంతన్నారు!? సిదిగిపోయిన సచ్చు సావుకార్లే కొంతన్నారు.... ఈ బాబు

(తరువాయి 15వ పేజీలో)

✱ ముదిగంటి సుజాతారెడ్డి

సెల్‌ఫోన్ల యాతనలు

మా కజిన్ రమ చాలా ఆందోళనకు గురైంది. దాన్ని ఊరడించడానికి మేమంతా దానింటికి పోయాం. రమ కండ్ల నుండి ఎడ తెగకుండా కన్నీళ్ళ ధారలు కట్టాయి. పెద్దగా ఏడ్వడం లేదు గాని చాలా బాధలో ఉంది. ఏమిటంటే - దాని భర్త సురేష్ విజయవాడ నుండి రావలసి వుంది. ఇంకా రాలేదు. విజయవాడలో బయలుదేరే ముందు సెల్‌ఫోన్‌లో మాట్లాడాడు. "ఇదో! విజ్జి ఇంట్లో ఇడ్లీలు తిన్నాను. బయలుదేరుతాను" అని. మళ్లా బయలుదేరుతూ కారులో కూర్చుంటూ మరోసారి సెల్ నొక్కాడు. "రమ్మీ! బయలు దేరుతున్నాను!.... స్టార్ట్!...." అంటూ సందేశమిచ్చాడు. మళ్ళా అర్థగంటకే "రోడ్డు పక్కన ఆగాం. ఛాయ్ తాగుతున్నాను. నాకు కాఫీ పడదని నీకు తెలుసుగా!" అని చెప్పాడు. మరో అర్థగంటకు సెల్ నొక్కి "రమ్మీ! కారు టైర్ పంక్చరైంది. మార్చాను. ఇదిగో స్టార్ట్! గో..." అన్నాడు. సురేష్ వచ్చాకే భోంచేద్దాం అనుకుంది రమ ఇక. మరో అర్థగంటకు సెల్‌లో నెంబర్లు నొక్కి "రమ్మీ! ఆకలిగా వుంది. ఇక్కడే భోంచేస్తా. నువ్వూ భోం చేయి. నాకోసం చూడకు" అన్నాడు. దీంతో రమ నిట్టూర్చి భోం చేసింది. మరో అర్థగంటకు సెల్ మోగింది. రమ ఆదుర్దాగా సెల్‌ను చెవి దగ్గరకు చేర్చింది. "రమ్మీ! నేను నక్రేకల్‌కు వచ్చేశాను. ఇక్కడ తాటి ముంజలు అమ్ముతున్నారు. నీకిష్టం కద! కొననా?" అడిగాడు సురేష్ "అబ్బా! తీసుకురా సురేష్, అది కూడా అడగాలా?" అంది.

"అది కాదోయ్! నేనెక్కడున్నానో నీకు తెలియాలి గద అని ఫోన్ చేశాను." నవ్వాడు సురేష్. భర్త అనురాగానికి పొంగిపోయింది రమ. కాని ఆ తర్వాత మంచి ఫోన్ లేదు. రెండు మూడు గంటల్లో ఇల్లు చేరవలసిన సురేష్ నాలుగ్గంటలైనా ఇంటికి చేరలేదు. రమకు ఆందోళన మొదలైంది. బంధువులందరికీ సమాచారమందింది. రమ నిశ్శబ్దంగా కన్నీళ్ళు కారుస్తున్నది. అందరూ టెన్షన్‌లో పడిపోయారు. పోలీసులకు ఫోన్ చేసి నకిరేకల్ హైదరాబాద్ మధ్య రహదారి సెవెన్‌లో ఏమైనా యాక్సిడెంట్లు అయ్యాయా? అని కనుక్కున్నారు. ఎందుకంటే ఆ రోడ్డు యాక్సిడెంట్లకు పెట్టింది పేరు. అందులో నకిరేకల్ అయిపాముల దగ్గర ఎన్నో యాక్సిడెంట్లు జరిగాయి. కొందరు బతికి బట్టకట్టగా కొందరు ప్రాణాలు కోల్పోయారు. గత రాత్రి నుండి అక్కడేం యాక్సిడెంట్లు జరగలేదని పోలీసుల సమాచారం. అందరికీ మనస్సు కాస్త కుదుట పడింది. "అయితే సురేష్ ఏమైనట్లు!" రమ ఒకటే ఏడ్పు. దాని బ్లడ్‌ప్రెషర్ ఎక్కిందని దాని తమ్ముడు డాక్టరు కొలిచి చెప్పాడు. ఏవోమందు గోలీలు మింగటానికి ఇచ్చాడు. అవి కాస్త మత్తు గోలీలేమో రమ కాస్త పడుకుంది. అక్కడున్న వాళ్ళందరికీ టెన్షన్. అప్పుడు సురేష్ కారు వచ్చి ఇంటిముందాగింది. సురేష్ వచ్చాడు! - అందరూ నిట్టూర్చారు.

"సురేష్ ఏమైంది? ఎక్కడున్నావ్" అని ప్రశ్నల పరంపర. సురేషేమో నవ్వుతూ హాయిగా వున్నాడు.

"ఫోనెందుకు చేయలేదు. రమ ఎంత ఆందోళన పడిందో తెలుసా?"

"ఫోన్ చేద్దామనే చూశాను. కాని సెల్ సడన్‌గా పని చేయడం మానేసింది. అందుకే ఫోను చేయలేకపోయాను" సురేష్ నవ్వుతూనే అన్నాడు.

"ఎక్కడైనా ఆగి ఎస్.టి.డి. ఫోన్ చేయొచ్చు కద!" మరో ప్రశ్న.

"అరే అట్లా ఫోన్ చేయాలనే తోచలేదు నాకు. అయినా ఫోనెందుకు?" అడిగాడు సురేష్. అంతకుముందు సెల్‌లో పావుగంటకోసారి మాట్లాడిన నువ్వు తర్వాత నీ ఫోన్ రాకపోవడం నువ్వు రావడం ఆలస్యం కావడం - దాంతో రమ ఎంత పరేషానైందో తెలుసా?" సురేష్ మీదికి లేచారెవరో.

"అరే! మధ్యలో వనస్థలిపురంలో దోస్తు ఇంటికి పోయాను కలవాలని. వాడితో మాట్లాడుతూ టైమే మరచిపోయాను. ఐయామ్ సారీ! ఏది రమ?" అని లోపలికి దారితీశాడు సురేష్.

ఇది సెల్ ఫోన్ సృష్టించిన పరేషాన్! అసలు సురేష్ మొదలు గడిగడికి ఫోన్ చేయకపోతే రమకి పరేషాన్ వుండేది కాదు. చేతిలో అలంకారంగా ఫోన్ పెట్టుకున్న సురేష్ కోతికి కొబ్బరికాయ దొరికినట్లుగా మాటిమాటికి నెంబర్లు ఒత్తి రమతో మాట్లాడే క్రీడ చేయడంతో ఇంత గందరగోళం సృష్టించబడింది! - ఏం ఫోన్లో ఏంటో-అని అనుకుంటూ అందరూ వెళ్ళిపోయారు.

మొన్నొకసారి హోటల్‌కు పోతే మాకెదురుగా వున్న టేబుల్ ముందు కూర్చున్న యువకుడు చేతిని చెంపకు చేర్చి మా వైపు చూసి మాటిమాటికి చిరునవ్వు నవ్వుతున్నాడు. అతడెవరో మాకెవరికీ తెలియదు. ఎందుకు నవ్వుతున్నాడో అర్థం కాక పిచ్చివాడా? ఏంటి అనుకున్నాం. కాని కాసేపయ్యాక తెలిసింది! చెంపకు చేర్చిన చేతిలో కనపడనంత చిన్న సైజులో సెల్ వుందని. దాంట్లో అతడు ఎవరితోనో సంభాషిస్తూ ఆనందిస్తున్నాడని! ఇట్లాంటి దృశ్యాలతో మనం ఫూల్స్ అవుతుంటాం. ఇక వేగంగా పరిగెత్తే మోటార్‌సైకిల్ మీద పోతూ, ఒక్క చేతితో అలవోకగా కారు డ్రైవ్ చేస్తూ సెల్‌ఫోన్లో మాట్లాడే దృశ్యాలు చాలా ఆకర్షణీయంగా, రొమాంటిగ్గా - మనమూ ఆ విధగా మాట్లాడే భాగ్యం కలిగితే బాగుండునని యువతను ఊరించే విధంగా వుంటాయి. ఇక స్కూలు, కాలేజీ పిల్లలకూ తల్లిదండ్రులు సెల్లు కొనిస్తున్నారు. కంపెనీలు స్పెషల్ ఆఫర్లతో విద్యార్థుల కోసం స్కీమ్‌లు ప్రకటిస్తున్నాయి. ఇకసెల్ ఫోన్ను కొనకుండా ఎట్లావుంటారు వాళ్ళు!

మా ఫ్రెండ్ లల్లీ దాని కొడుక్కి సెల్ ఫోనిచ్చింది. "ఎందుకే అంత చిన్నవాడికి. దాంతో చెవుల్లో, మెదడులో క్యాన్సర్లు వస్తాయంటున్నారు..." అన్నాన్నేను." వాడి క్షేమం కోసమే ఈ సెల్. స్కూల్లో వాడు క్షేమంగా వున్నాడా లేదా? ఏ కిడ్నాపర్ల చెరలో పడకుండా ఇంటికి చేరుతున్నాడా? అన్న ఆందోళన లేకుండా వుంటుంది హాయిగా..." అంది లల్లి. ఇద్దరు పిల్లలుంటే పిల్లలకు చెరో సెల్, తల్లి తండ్రికి చెరో సెల్ ఇట్లా మొత్తం ఫ్యామిలీ ఎప్పుడు ఎక్కడ ఏం చేస్తున్నారని ఒకరికొకరికి క్షణంలో తెలిసిపోతుంది మరి! నా మరో ఫ్రెండ్ భర్త దుబాయిలో వున్నాడు. ఆయన గడిగడికి సెల్‌లో మాట్లాడుతూ భార్యా పిల్లలతో కాంటాక్టులో వుంటాడు. వాళ్ళు లేచినా కూర్చున్నా పండుకున్నా వార్తలు ఆయనకు అందుతుంటాయి. సెల్‌ను ఎవరు కనిపెట్టారోగాని ఇట్లా ఉపయోగాలు, లాభాలు చాలానే వున్నాయి. చాలామంది చేతుల్లో అది అలంకారంగా, స్టేటస్ సింబల్‌గా మారి పోయి కనిపిస్తున్నది. అందులో రకరకాల ఆకారాల్లో రంగుల్లో కాంతులతో ప్రోగ్రాం స్కీమ్‌లతో సెల్ కంపెనీలు వాడకందార్లను ఆకర్షిస్తూ బోలెడు బహుమానాలను కార్లు, మైక్రోవేవ్‌లు మొదలుకొని బ్యాగ్‌ల వరకు ఇస్తామంటున్నాయి. అట్లా సెల్‌లను అమ్ముకునే ఉపాయాలు ఎన్నో!

మా ఇంట్లో ఒక చిన్న రూమ్ కిరాయికి ఇస్తామని బోర్డు పెడితే ఒక అబ్బాయి వచ్చాడు. నేను స్టూడెంట్‌నండీ. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాను. అంత కిరాయి ఇవ్వలేను. మా నాన్నది చిన్న ఉద్యోగం కష్టపడి చదువుకుంటున్నాను.." అన్నాడు ఒక మోస్తరు దీనంగా. సరే! విద్యార్థికి అందులో సహాయం అవసరమున్న విద్యార్థికి చేయూతనివ్వాలనే మంచి మనస్సుతో కిరాయి తగ్గించి ఇచ్చాను. కాని తెల్లవారి చూస్తే ఆ అబ్బాయి వాకిట్లో నిలబడి సెల్‌ఫోన్లో ఎవరితోనో ఆనందంగా మాట్లాడుతుండడం చూసి నేను అవాక్కయిపోయాను. బీద విద్యార్థి అంటే ఈ కాలంలో మోటర్ సైకిల్, సెల్ ఫోన్ వుండి పూటకు తిండి లేకుండా కేవలం కర్రీపఫ్‌ల మీద, పిజ్జా బర్గర్, కోకాకోలాల మీద బతికేవాడని అర్థం! అదే సెల్‌ఫోన్ యుగ మహిమ. మరి చైనాలో ఇరవైకోట్ల సెల్‌లు వాడకంలో వుంటే మన దేశంలో రెండు కోట్లు మాత్రమే సెల్‌లు వున్నాయట! పాపం! వెనుకబడి ఎదుగుతున్న దేశం కద మనది! అందుకే! ఇంత తక్కువ ఫోన్లతో ఇన్ని యాతనలుంటె. సెల్‌లు పెరిగే కొద్దీ ఎన్ని యాతనలలో మరి! ●

* యం.మదన్ మోహన్ రావు

సాక్షి

ఒక ఠాకూర్, ఓ వైశ్యుని దగ్గర చాలా ఎక్కువ మొత్తంలో అప్పు తీసుకున్నాడు. దాని గురించి ఎన్నిసార్లు గుర్తుచేసినా ఆ అప్పు మాత్రం తీర్చటంలేదు. వైశ్యుడు ఒకసారి ఠాకూర్ ఇంటికి వెళ్లాడు. అప్పుడాయన తన అతిథులతో మాట్లాడుతున్నాడు. అలాంటి సమయంలో తన అప్పు తీర్చమని అడిగాడు వైశ్యుడు. వారి ముందు అడిగేటప్పటికి ఠాకూర్‌కు కోపం వచ్చింది. అప్పు తీర్చే ఉద్దేశం ఆయనకు ఏ కోశానా లేదు. పైగా తనను బంధువుల ముందు అవమానించినట్టుగా భావించాడు. అందుకు ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు. తగిన సమయం కోసం ఎదురుచూస్తుండగా ఒక నిర్జన ప్రదేశంలో వైశ్యుడు ఎదురుపడ్డాడు.

"నన్ను అవమానించిన వాడెవడూ నా నుంచి తప్పించుకోలేడు" అని గర్జిస్తూ అతనిపైకి కత్తి దూశాడు ఠాకూర్.

ఆ వైశ్యుడు ఒక్క క్షణం ఆలోచించి "నువ్విలాంటిదేదో చేస్తావని నేను అనుకుంటూనే వున్నాను. అందుకే ఒక ఉత్తరంరాసి నా భార్యకు ఇచ్చి వచ్చాను. రాత్రి అయ్యేసరికి నేను ఇంటికి చేరకపోతే ఆ ఉత్తరాన్ని ఆమె న్యాయమూర్తి దగ్గరకు తీసుకెళ్తుంది. ఆ ఉత్తరంలో మనిద్దరి మధ్య జరిగిన లావాదేవీలు, నేను డబ్బు తిరిగి పొందటానికి చేసిన ప్రయత్నాలు వివరించాను. దాంట్లో నీ నుంచి నాకు ప్రాణహాని వుందని కూడా రాశాను" అన్నాడు తెలివిగా.

ఠాకూర్ ఎత్తిన కత్తి దించాడు. అతను చెప్పేది నిజంకాదని తెలుసు. అప్పు ఎగవేసిన వారి పట్ల, హంతకుల పట్ల ఆ న్యాయమూర్తి చాలా కఠినంగా వుంటాడని కూడా ఠాకూర్‌కు తెలుసు. అయినా అవకాశం వదులుకోదలచలేదు.

"సరే! నీ పనికిరాని ప్రాణం నాకెందుకుగానీ నీ ముక్కు చెక్కేస్తా. అది నీకు జన్మలో మరచిపోలేని గుణపాఠం నేర్పుతుంది" అన్నాడు ఠాకూర్.

"నీ అప్పు చెల్లుబెడితే, నన్ను క్షమించి వదిలేస్తావా?" అని అడిగాడు వైశ్యుడు.

"సరే. కానీ నీ అప్పు పూర్తిగా చెల్లించినట్టుగా నాకు ఒక రశీదు ఇవ్వాలి" అన్నాడు ఠాకూర్.

తన రశీదు పుస్తకం తెరిచి "ఇప్పుడే రశీదు రాసిస్తాను. కానీ ఇందుకు ఒక సాక్షి కావాలి" అన్నాడు వైశ్యుడు.

"సాక్షి లేదు. ఏం లేదు. నేను బాకీ మొత్తం తీర్చినట్లుగా రశీదు ఇవ్వు" గద్దించాడు ఠాకూర్.

"సాక్షి లేనిదే ఈ రశీదుకు విలువ వుండదు. పోనీ ఆ మర్రి చెట్టును సాక్షిగా పెట్టుకుందామా?" అడిగాడు వైశ్యుడు.

మర్రి చెట్టును సాక్షిగా పెట్టుకోవటంలో ఏ హానీలేదు కదా! అనుకున్నాడు ఠాకూర్. 'పైగా ఆ రశీదు ఎప్పుడు, ఎలా రాసింది మర్రిచెట్టు చెప్పలేదుకదా' అని సమాధానపడి ఒప్పుకున్నాడు.

వాళ్లిద్దరూ మర్రిచెట్టు కింద నిల్చున్నారు. వైశ్యుడు రసీదు రాసి ఠాకూర్ చేతికిచ్చాడు. అతను దాన్ని మడిచి సంతృప్తిగా జేబులో పెట్టుకుని వెళ్లిపోయాడు.

కానీ మరునాడే అతనికి న్యాయమూర్తి దగ్గర నుండి పిలుపు వచ్చింది. ఠాకూర్ అక్కడికి వెళ్లేసరికి వైశ్యుడు అక్కడే వున్నాడు.

"నువ్వు ఇతని దగ్గర అప్పు తీసుకున్నావా?" అడిగాడు న్యాయమూర్తి.

"తీసుకున్నాను" అన్నాడు ఠాకూర్.

"మరి దాన్ని ఎందుకు తిరిగి చెల్లించలేదు?"

"తిరిగి చెల్లించానే. కావాలంటే ఈ రశీదు చూడండి" అంటూ విజయగర్వంతో తన జేబులోవున్న రశీదు తీసి న్యాయమూర్తి చేతికిచ్చాడు ఠాకూర్.

"అయితే మీ సాక్షి ఒక మర్రి చెట్టన్న మాట" అన్నాడు న్యాయమూర్తి.

"అవును. అక్కడ ఇంకెవరూ లేరు" చెప్పాడు ఠాకూర్.

"అంటే నువ్వు ఎవరూ లేని చోట ఇతన్ని అడ్డగించానని ఒప్పుకుంటున్నావా?" ప్రశ్నించాడు న్యాయమూర్తి.

"లేదు.. లేదు.. అనుకోకుండా అతణ్ణి అక్కడ కలిశాను" వణుకుతూ అన్నాడు ఠాకూర్.

"ఏది ఏమైనా ఈ రశీదు చెల్లదు. ఇందులో వైశ్యుని సంతకం లేదు. కేవలం మర్రిచెట్టు అనే వుంది" అన్నాడు న్యాయమూర్తి.

"ఏమిటీ!?" అంటూ ఠాకూర్ ఆ పత్రాన్ని న్యాయమూర్తి దగ్గర నుండి తీసుకుని పరీక్షగా చూశాడు. వెంటనే అతని ముఖం పాలిపోయింది. ఆ పత్రం అడుగున తాను సంతకం చేయడానికి బదులుగా 'మర్రిచెట్టు' అని రాశాడు వైశ్యుడు.

(రాజస్థాన్ జానపద గాథ)





క్విజ్ 85కి జవాబులు

1. శుక్లము 2. మహ్మద్ ఇగ్బాల్ 3. డిసెంబర్ 10 4. ది 5. సండూరి సుబ్బారావు 6. వాల్ట్ డిస్నీ 7. శ్రీశ్రీ 8. నాగార్జునసాగర్ 9. యుగోస్లావియా 10. ఆశాపరేఖ్

క్విజ్ 84కి సరైన సమాధానాలు రాసిన వారు :

కె.సుభాషిణి, 6వ తరగతి, పుల్లల చెరువు, ప్రకాశం. **నూకాల తనూజ**, 7వ తరగతి, అరసవిల్లి, శ్రీకాకుళం. **పడాల శ్రీలత**, 8వ తరగతి, మల్లిఖార్జున కాలనీ, రాజాం. **కాలువ శ్రీ అనూహ్య**, 5వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు. **పెంటకోట అమర్ జయసింహ**, గవరపాలెం, అనకాపల్లి. **యు.యేసేబు**, 10వ తరగతి, **వి. పుల్లారావు, కృష్ణ**, 10వ తరగతి, యర్రగొండపాలెం, ప్రకాశం. **పెద్ది అశోక్**, 10వ తరగతి, చెన్నూర్, వరంగల్. **యు.యు.బాబు నరేంద్రప్రసాద్**, 6వ తరగతి, **జె.గాయత్రి**, 10వ తరగతి, **పి.షహనాజ్ సల్మా**, 10వ తరగతి, లక్ష్మీపేట, ఎమ్మిగనూరు.

కలం స్నేహం

పేరు: జె.పూల్‌సింగ్,
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : ప్రజాశక్తి పేపరు చదవడం, క్రికెట్ ఆడడం, పాటలు పాడడం.
పూర్తి చిరునామా : జె.పూల్‌సింగ్, 10 వ తరగతి, ఎపి.టి.డబ్ల్యు.ఆర్.స్కూల్, బాలానగర్, మహబూబ్ నగర్–509202.

పేరు: గ్యానం చైతన్య,
వయసు : 11 సం॥
చదువు : 6వ తరగతి
హాబీలు : ప్రజాశక్తి పేపరు, కథలు చదవడం, డ్రాయింగ్ వేయడం.
పూర్తి చిరునామా : గ్యానం చైతన్య, వెంకటాపురం, ఖమ్మం.

కలం స్నేహం చేయాలని వుందా!

మరి ఆలస్యం ఎందుకు? ఒక కార్డు తీసుకుని మీ పేరు, హాబీలు, చదువుతున్న తరగతి, పూర్తి అడ్రస్ రాయండి. ఇంకా... మీ ఫొటో కూడా అతికించి పోస్టు చేయండి...అంతే. మా చిరునామా : బాలనేస్తాలు, ప్రజాశక్తి, ప్లాట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.



ఏది పెద్దది?

హాయ్! ఈ వారం మిమ్మల్ని చాలా సులభమైన ప్రశ్న అడుగుతాను. వెంటనే జవాబు చెప్పాలి. ప్రశ్న చదివాక 'అబ్బా! మరీ ఇంత తేలిక ప్రశ్నా అడిగేది?' అని వేళ్లు విదుల్చుకోకూడదు. పైన ఒక బొమ్మ వుంది కదా. అందులో రెండు వరసల్లో ఇళ్లు వున్నాయి. అక్కడ ఎడమవైపున 'ఎబి' గీత, కుడివైపున 'సిడి' గీత వున్నాయి. ఈ రెండిట్లో ఏది పెద్దగీత?

'ఏంటండీ? మరీ ఇంత ఈజీ ప్రశ్నా మమ్మల్ని వేసేది? ఇదొక ప్రశ్న. దానికో జవాబు చెప్పాలి!' అని ఆశ్చర్యంగా చూస్తున్నారు కొందరు చిన్నారులు. మీరేమనుకుంటే నాకెందుకు? ముందు నాప్రశ్నకు జవాబు చెప్పండి. 'ఎబి' గీతే పెద్దది' అంటున్నారు చాలా మంది. మీ జవాబు ఇదేనా... ఏమైనా తేడా వుంటే ఇప్పుడే చెప్పండి. ఒకటి... రెండు...మూడు... ఓకే అంతా 'ఎబి' గీతే పెద్దదని బల్ల గుద్ది మరీ చెప్తున్నారు. కాబట్టి...'ఆగండాగండి. 'సిడి' గీత పెద్దది' అంటున్నారు కొందరు.

కానీ మీరంతా తప్పులో కాలు వేశారోచ్. 'ఎబి' గీత, 'సిడి' గీత రెండూ సమానమైన గీతలే.

మేజిక్! మేజిక్!!

'అబద్ధం. మీరు మమ్మల్ని చిన్న పిల్లల్ని చేసి మోసం చేస్తున్నారు. 'ఎబి' గీత పెద్దదని చక్కగా కళ్లకి కనపడుతోంది కదా. పిల్లలకి అబద్ధాలు చెప్తే మీకు చాక్లెట్లు దొరకవు. తర్వాత మీ ఇష్టం' అని కొందరు బెదిరిస్తున్నారు కూడా. కానీ చిన్నారులూ నేను చెప్పింది నిజమే. మన కళ్లు ఒక్కోసారి మనల్నే మోసం చేస్తాయి. కావాలంటే స్కేలుతో కొలిచి చూసుకోండి. ఏంటి కదలరు? ముందు స్కేలు తీసుకోండి. తీసుకున్నారా! కొలవండి. ఇప్పుడు చెప్పండి. రెండు గీతలు సమానంగా వున్నాయా? లేదా? అమ్మయ్య. ఇప్పటికైనా అంగీకరించినందుకు సంతోషం. ఏంటి ఇంకా అలా కూర్చున్నారు. వెంటనే మీ స్నేహితులను ఈ ప్రశ్న అడిగి చూడండి. మళ్లీ వచ్చేవారం మరో మేజిక్ చెప్పకుందాం.

చూడలేని చేప

కళ్లుంటే చూడగలగాలికదా! కానీ ఆగ్నేయ అమెరికాలో నివసించే కొన్ని చేపలు కళ్లున్నా చూడలేవు. కేవ్ ఫిష్‌గా పిలువబడే ఈ చేపలు గులాబీ రంగులో వుంటాయి. వీటికి చర్మం చాలా పలుచగా వుంటుంది. అందుకే లోపలి రక్తనాళాలు గులాబీ రంగులో కనిపిస్తాయి. పైగా పొలుసులు కూడా తక్కువగా వుంటాయి. వీటి చర్మంమీద వుండే సున్నితమైన గ్రాహకాలు పరిసరాలను తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి. మరో విశేషమేమిటంటే... ఆడ చేపలు తమ గుడ్లని మొప్పలకింద దాచుకుంటాయి. అవి పొదగబడి పిల్లలు అయ్యేంత వరకూ అలానే మోస్తూ వుంటాయి. ఈ చేపల శాస్త్రీయనామం ఆంబ్లియాప్సిస్ స్పెలేయే.



ఎస్.నవీన్, 7వ తరగతి,
ప్రగతిబాలవిద్యాలయం.తాడేపల్లి,
గుంటూరు

టి.దుర్గ, 7వ తరగతి,
ప్రగతిబాలవిద్యాలయం,
తాడేపల్లి, గుంటూరు

చిన్నారి చిత్రకారులు

ఎస్.సంపత్‌కుమార్, 8వ తరగతి,
ప్రగతిబాలవిద్యాలయం,
తాడేపల్లి, గుంటూరు

డి.అనీష్, 7వ తరగతి,
బోయినపల్లి,
సికింద్రాబాద్.

క్విజ్-86

1. **హోమియో వైద్య విధానానికి మూల పురుషుడెవరు?**
   ఎ. హానిమన్ బి. నెపోలియన్
2. **కౌటిల్యుడు ఏ రాజు దగ్గర మంత్రిగా వున్నాడు?**
   ఎ. చంద్రగుప్త మౌర్యుడు బి. అశోకుడు
3. **'కన్యాశుల్కం' రచించినదెవరు?**
   ఎ.రాజారామమోహనరాయ్ బి. గురజాడ అప్పారావు
4. **ఈల వేసే జంతువు ఏది?**
   ఎ. డాల్ఫిన్ బి. పులి
5. **ఆంగ్లంలో తక్కువగా ఉపయోగించే అక్షరం ఏది?**
   ఎ. జడ్ బి. ఎ
6. **'వైట్ రెవల్యూషన్' అంటే...?**
   ఎ. అధిక పాల ఉత్పత్తి బి. అధిక గోధుముల ఉత్పత్తి
7. **ఈ దేశాన్ని తెల్ల ఏనుగుల దేశం అంటారు?**
   ఎ.థాయ్‌లాండ్ బి. అర్జెంటీనా
8. **ఆకు కూరల్లో అధికంగా వుండేది?**
   ఎ.'ఎ' విటమిన్
   బి. పిండి పదార్థం
9. **భారత దేశపు రెండవ ప్రధాని?**
   ఎ.జవహర్‌లాల్ నెహ్రూ
   బి.లాల్ బహదూర్ శాస్త్రి
10. **ఈ ఫొటోలోని వ్యక్తి పేరేమిటి?**
   ఎ.చే గువేరా
   బి. ఫైడల్ కాస్ట్రో

ఉపాయం

అక్బర్-బీర్బల్ కథలు



ఓ నాడు [illegible] రాజ్యంలో పర్యటిస్తున్నారు. మార్గ మధ్యలో పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు. అప్పుడు అక్బర్ బీర్బల్‌వైపు తిరిగి 'పండిట్‌జీ! అకస్మాత్తుగా ఏదైనా ఆపద ఎదురైతే సహాయపడేది ఏది?' అన్నాడు. బీర్బల్ కాసేపు ఆలోచించి 'ఉపాయం ఒక్కటే ప్రభూ!' అని జవాబు చెప్పాడు.

దానికి అక్బర్ 'ఆయుధం ఏదైనా వున్నా సాయపడదంటారా?' అనడిగారు.

'ఆయుధం వున్నా ఉపాయం లేకపోతే వృధానేకదా జహాపనా' అన్నాడు.

అలా వారు మాట్లాడుకుంటూ... కొంత దూరం వెళ్లారు. అక్కడ వారికి ఒక ఏనుగు కనిపించింది. అది ఘీంకరిస్తూ కనబడిన వారినందరిని తొండంతో కొడుతూ పైకి విసిరి వేస్తోంది.

అక్బర్, బీర్బల్ ఆ మదించిన ఏనుగును చూశారు. చక్రవర్తి దగ్గర ఖడ్గం వుంది. అయితే మాత్రం ఎలా తప్పించుకుంటారు? ఎటైనా సురక్షిత ప్రదేశానికి వెళ్లాలనుకున్నారు.

తొందరగా పరిగెత్తి ఒక ఎత్తైన భవనపు అరుగులమీద నిలబడ్డారు. ఏనుగు వెళ్లిపోయింది.

అప్పుడు బీర్బల్ 'ప్రభూ! గండం గడిచింది. ఉపాయం తోచబట్టేకదా. ఇక్కడకు పరిగెత్తుకుని వచ్చాము. ఏనుగు బారినుంచి తప్పించుకోగలిగాము' అన్నాడు.

బీర్బల్ చెప్పింది నిజమేననుకున్న చక్రవర్తి అతని నిశితబుద్ధిని మెచ్చుకున్నారు.

రంగులు అద్దుతారా!



✻ పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ



రివ్వున గాలి వీస్తుంది.

కర్నూలు జిల్లా శ్రీశైలంలో ఏపుగా ఎదిగిన చెట్లు తలలు ఊపుతున్నాయి. మొక్కలు ఆనందంతో పులకిస్తున్నాయి.

నండూరి శరగోపన్ మనసు ఆనందంతో నిండిపోయింది.

వీస్తున్న గాలి మనసుకు ఆనందాన్ని కలిగిస్తోంది.

హృదయంలోంచి ఉబికి వస్తున్న ఉద్వేగాన్ని అణచుకోలేక పోతున్నాడు.

చేతిలో ఉత్తరం రెపరెపలాడింది.

గిన్నీస్ పుస్తకంలో తనకు స్థానం లభించిందన్న సారాంశంతో వచ్చిన ఆ లేఖను ఎన్నిసార్లు చదువుకున్నాడో తెలియలేదు. తెలిసిన వారికందరికీ చూపిస్తూ అందులోని విషయాన్ని వివరిస్తూనే వున్నాడు. శరగోపన్ కళ్ళల్లో మెరుపుల్ని చూసిన వారు ఆనందం ఇంత అద్భుతంగా ఉంటుందా' అనుకుంటున్నారు.

శ్రీశైలం మల్లిఖార్జునస్వామి దేవాలయంలో సూపరింటెండెంట్ హోదాలో ఆ ఉత్తరాన్ని సిబ్బంది అందరికీ చూపించాడు. అందరి నుంచీ అభినందనలూ... ప్రశంసలూ వింటుంటే మరింత ఆనందం కలిగించింది.

"మిరపమొక్క అంత ఎత్తు ఎదిగిందా?" అంటు చాలా మంది ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తుంటే జేబులో భద్రంగా దాచిన ఫొటోలను వారికి చూపించేవాడు. "ఎవరూ నమ్మరు... కానీ నిజం... తాటి చెట్టు లాంటి మిరపచెట్టు-" అనేవాడు.

గిన్నీసు బుక్కు ఎప్పుడు విడుదల అవుతుందా అందులో తన పేరు, వివరాలు ఎప్పుడు చూసుకుందామా అని శరగోపన్ ఆరాటపడిపోయేవాడు.

ఆ రోజు రానే వచ్చింది.

అధికారికంగా విడుదలైన పుస్తకంలో వివరాలన్నీ చదివి మరింత ఆనందం పొందాడు. తెలుగువాడికి అరుదుగా లభించిన అవార్డుగా అందరూ అభినందించారు.

ఆ సంవత్సరం అంటే 1984 తన జీవితాన్ని మలుపు తిప్పిన సంవత్సరంగా గుర్తుంచుకున్నాడు. డైరీలో కూడా ఆ ఏడాది ప్రత్యేకతను రాసుకున్నాడు.

* * *

కృష్ణాజిల్లా మచిలీపట్నంలో పుట్టిన శరగోపన్ తెలుగువాడు. తమిళుల పట్ల ఆసక్తితో తల్లిదండ్రులు ఆ పేరు పెట్టారు.

అర్థశాస్త్రంలో డిగ్రీ చదివిన శరగోపన్‌కు మొదటి నుంచి మొక్కలంటే మక్కువ ఎక్కువ. పెరటి తోటలో రకరకాల మొక్కలను పెంచేవాడు. వాటిని సంరక్షిస్తూ ఆనందాన్ని పొందేవాడు.

1978లో శ్రీశైలం దేవస్థానంలోని తన క్వార్టర్‌లో కొన్ని మిరప విత్తనాలను జల్లాడు. అందులో ఒక మొక్క అనూహ్యంగా పెరిగిపోయింది. పెరుగుదల చూసి ఆ మొక్కలో ఏదో ప్రత్యేకత ఉందని శరగోపన్ గుర్తించాడు. ఎరువులు, పురుగు మందులు ప్రత్యేకంగా కొనుగోలు చేసిన శ్రద్ధ తీసుకుని సంరక్షించాడు. రెండేళ్ళలో చేతికి అందని ఎత్తులో పెరిగిపోయింది. విరిగిపోకుండా, వాలిపోకుండా అటుఇటు కర్రలతో దడికట్టి సంరక్షించాడు.



మిరప మొక్కకు సంబంధించి వివిధ రకాల పుస్తకాలను అధ్యయనం చేశారు. దీంతో తన ఇంటి పెరడులో ఏపుగా ఎదిగిన మిరప మొక్కలో ప్రత్యేకత ఉందని శరగోపన్ గుర్తించాడు.

మిరపచెట్టు ఏడాది మాత్రమే దిగుబడి ఇస్తుంది. మూడు లేదా నాలుగు అడుగులు మాత్రం ఎత్తు పెరుగుతుంది. తన జీవిత కాలంలో అరకిలో ఎండుమిర్చి దిగుబడి ఇస్తుంది. అయితే శరగోపన్ ఇంటిలో పెరిగిన చెట్టు 13.8 అడుగుల ఎత్తులో రెండున్నర ఏళ్ళ పాటు నాలుగున్నర కిలోల ఎండు మిర్చిని దిగుబడిగా ఇచ్చింది.

ఈ విషయాన్ని అధికారులందరికీ తెలియజేశాడు. హైదరాబాద్ రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఈ చెట్టు గొప్పతనాన్ని గుర్తించి కితాబు ఇచ్చారు. న్యూఢిల్లీలో ఐ.సి.ఎ.ఆర్. సంస్థ ఈ చెట్టు గురించి పరిశోధన చేసింది.

అప్పుడు గిన్నీస్‌బుక్ పట్ల శరగోపన్ దృష్టి కేంద్రీకరించాడు. మొత్తం వివరాలు... ఫోటోలు అన్నీ పంపించాడు. వారు వివిధ దేశాల్లో వివరాలన్నీ వాకబు చేశాక ఇటువంటి చెట్టు మరెక్కడా లేదని నిర్ధారించుకుని గిన్నీసు పుస్తకంలో స్థానం కల్పించారు.

* * *

"మిరప పంట రాష్ట్రంలో ఎంతో అవసరం ఉంది. మీరు పెంచిన విధానం అందరికీ తెలియజేయాలి-"

జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

రాజారావు కోరారు.

"నేనా?"

"గిన్నీస్ పుస్తకంలో మీ పేరు, కృషి నమోదు కావడం అందరికీ తెలిసిందే... మీ స్ఫూర్తితో ఈ పంటను అధిక దిగుబడితో రైతులందరికీ ప్రచారం చేయాలనుకుంటున్నాను."

"అనుకోకుండా నాకు అవకాశం లభించింది. దానికి నా కృషి కొంత తోడైంది!" శరగోపన్ చెప్పాడు.

తర్వాత మిరప పంటలో తన అనుభవాలు పెరిగే విధానంలో తీసుకోవలసిన జాగ్రత్తలు... అధిక దిగుబడి కోసం చేయవలసిన కృషి మొత్తం వివరించాడు. ఎప్పుడో తాను పొందిన పురస్కారం ఇంతటి గుర్తింపును తెస్తుందని అనుకోలేదు.

అతను అందించిన వివరాలు గొప్ప ఫలితాలు కలగజేశాయి. మిరప విత్తనాలను నాటే దగ్గర నుంచి తీసుకున్న చర్యల వల్ల దిగుబడి పెరిగింది. అనేక వ్యవసాయ క్షేత్రాల్లో ప్రయోగాత్మకంగా ఈ విషయం నిరూపించబడింది.

ఆ తర్వాత శరగోపన్ జాతీయ స్థాయిలో న్యూఢిల్లీలో వ్యవసాయ ప్రదర్శన ఏర్పాటు చేశారు. వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులు అధిక దిగుబడి పంట రకాలను చూసి ప్రముఖులు ప్రశంసలు కురిపించారు.

తన కృషిలో భాగంగా ఆరేళ్ళకాలంలో వివిధ రకాలకు చెందిన 200 అవార్డులను కైవసం చేసుకున్నాడు శరగోపన్.

* * *

2001 సంవత్సరం

నందూరి శరగోపన్ హార్టికల్చర్ స్పెషలిస్టుగా ప్రత్యేక గుర్తింపు పురస్కారాన్ని పొందాడు.

కన్సల్టెంటుగా వ్యవసాయ ఉత్పత్తుల సంస్థకు నియమితుడయ్యాడు. పర్యావరణ పరిరక్షకుడిగా ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా అభినందన అందుకున్నాడు.

మద్రాసు తెలుగు అకాడమీ ఉగాది పురస్కారాన్ని ప్రకటించింది. గిన్నీసు వీరుడిగా ఘన సన్మానం చేసింది. ఎంతోమంది ప్రముఖులు అభినందనల ప్రశంసల జల్లు కురిపిస్తుంటే ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బు అయిపోయారు.

అవార్డు, పురస్కారాలతో స్వగ్రామం చేరాడు.

రోడ్డు పక్క అరబెట్టిన ఎండు మిరపకాయల ఘాటు ముక్కు పుటాలకు తగిలింది. ఎర్రగా కుప్పలు పోసి ఉన్న ఆ పళ్ళను ఆప్యాయంగా చూశాడు. ఆహార అవసరాలు తీరడానికి అందరి ఇళ్ళల్లో విరగకాసే మిరపచెట్లు వస్తాయని అతని మనసు ఆకాంక్షించింది. గట్టిగా ఊపిరి పీల్చుకుని ముందుకు కదిలాడు.

(9వ పేజీ తరువాయి)

రెండు అంతర్లోకాలు

ముసిలోడే కనీ ముసిలోణ్ణా లేనేలేదు! వెలగున్నాడంటే... ఏతంతే... రగతం కోసం కూడు దినకుండ రగతవే తాగేస్తున్నట్టున్నాడు! వెంతదబ్బు! వెంత పవరు! వెంత పలుకుబడి! ఈ బాబు కాడ వెంత పవరుందంటారు! ఒవులు?! పెజలు!!...' అలా అనుకుంటూ రమేష్ తలకాయలు పేరుస్తున్నాడు.

భూమేంద్ర చూస్తూ చూడనట్టు రమేష్‌లోకి చూస్తున్నాడు.

'...రమేష్ చిన్న దగా చేస్తున్నాడు. నేను పెద్దదగా చేస్తున్నాను. ఎవరి శక్తి మేరకు వాళ్ళు దగాలు చేస్తున్నారు. దోపిడీలు చేస్తున్నారు. దోపిడీ వ్యవస్థ అంటే అదే! సముద్రం ఏం చేస్తోంది? తనచుట్టూ వున్న భూవిని తనలో కలిపేసుకోవడానికి నిరంతరం అనుక్షణం పోరాడుతోంది! నేను పోరాడ్డం లేదు కానీ శాంతియుతంగా శాంతియుత మార్గంలో ఆ పనే చేస్తున్నాను! ఆకలికీ - అప్పుల బాధకీ - తట్టుకోలేని వాడు ఏం చేస్తాడు? ముందుగా ఆత్మహత్య చేసుకోడు! ఉన్న బూవినీ ఆస్తినీ అమ్మేసుగుంటాడు! ఆ మార్గంలో శాంతియుతంగా కొంతబూవిని సేకరించేను... ఆకలితో ఉన్న వాడికి ఆకలిబాధే కానీ బూవి విలువా, ఆస్తి విలువా, తెలీవు కాబట్టి ఎంతోకొంత పారేసి కొంత బూవిని సేకరించేను... కాగితాలు సులువుగా కాలిపోతాయి గాబట్టి మా సోదర ఉద్యోగవర్గ సహకారంతో శాంతియుతంగా కొంత బూవిని సేకరించేను - కాదు కాదు - ఆక్రమించేను... కాగితాలు ఎవరు ఏం రాసినా అడ్డుకోకుండా ఒప్పుగుంటాయి కాబట్టి శాంతియుతంగా వారి సహకారంతో కొత్త రికార్డులు సృష్టింపజేసి కొంత సేకరించాను. కాదు కాదు ఆక్రమించేను... వారూ బాగుపడ్డారు.. నేను బాగుపడ్డాను... అందుకే మనం బాగుపడేలా చేసే రాజ్యాన్నే మనం అధికారంలో వుంచుతాం! మనవే రాజ్యాధికారంలో వుంటాం! వుంటున్నాం! మేం చేస్తున్న వ్యాపారం - దోపిడీ - అభివృద్ధే అనీ పాలకవర్గాలూ ఉద్యోగవర్గాలూ - వారు కూడా అభివృద్ధి చెందుతూ వుంటారు! ప్రజలను నమ్మిస్తూ వుంటారు! ... రమేష్ గాడు కూడా ఎంత దగా చేస్తున్నాడో!...' అని భూమేంద్ర సంతోషంగా మనసులో అనుకుంటూ సంతోషంగా రమేష్‌లోకి చూస్తున్నాడు.

రమేష్ భూమేంద్ర మొహంలోకి చూసీ చూడనట్టు చూస్తున్నాడు.

'నేను సేత్తున్నదగా ఈ బాబు పసిగట్టేసినాడంటే టపటప నాగించేస్తాడో ఏటో!... సొక్కా పట్టుకు నాగిసింపేస్తాడో ఏటో!... మరో సొక్కా కూడా నేదు... తెలుగు పేపర్లు సరిదీసినాను.. మరింక వింగ్లీషు పేపర్లు తగుల్కొని సకసకలాడించేయాల...' అని రమేష్ మనసులో అనుకుంటూ ఇంగ్లీషు పేపర్లు వేరుచేస్తున్నాడు.

'... ఒరేయ్! రమేష్! దోపిడీ అందరూ చేస్తారనీ చేస్తున్నారనీ ఇప్పుడు చాలా స్పష్టంగా తెలుస్తోంది..... ప్రపంచంలో ఎన్నో సత్యాలున్నాయంటారు.. అవేవీ నేను నమ్మలేకపోతున్నాను... రెండే రెండు సత్యాలను నమ్ముతున్నాను. ""ఒకటి పెట్టుబడి- రెండోది శ్రమ"" అయితే సామ్రాజ్యవాద సహోదరులు లేదా సోదరులు ఎన్నో ఏళ్ళ నుండి ఒకే ఒకమాట చెప్తున్నారు... రెండు సత్యాల్లోనూ ఒకే ఒక సత్యం నిలబడాలనీ రెండో సత్యాన్ని ప్రపంచం నుండి పారిపోయేలా పోరాడాలని చెప్తూ పోరాడుతున్నారు.... 'పెట్టుబడి' అనే సత్యం మాత్రమే నిలబడాలంటున్నారు... దోపిడీ వ్యాపారమంటున్నారు.. అది సహజమైందనీ, వ్యాపారంలో, అభివృద్ధిలో భాగమేననీ అంటున్నారు... దోపిడీ కాకుండా అభివృద్ధి కాదంటున్నారు.. వారి మాటలను మేమందరం గౌరవిస్తున్నాం... ఆచరిస్తున్నాం.... వారు చూపిన మార్గంలో, సత్యంలో, మేమందరం బాగా బాగుపడుతున్నాం కాబట్టి, అదే సత్యాన్ని మేమందరం గాఢంగా ప్రేమిస్తున్నా, ఆచరిస్తున్నా, అభివృద్ధి చెందుతున్నాం... రెండే రెండు 'సత్యాలున్నాయని ఇంతవరకూ నమ్ముతున్నమేం ఒకే ఒక సత్యం వుండాలని విశ్వప్రయత్నం చేస్తున్నాం... ఒరేయ్, రమేష్! నువ్వు చేస్తున్న దగా చూస్తున్నప్పుడు ఇదంతా అనుకోకుండా నా మనసులోకి వచ్చేసింది. కానీ మనసులోనే అనుకుంటున్నాను...' అని భూమేంద్ర రమేష్‌తో చెప్పలేదు కానీ మనసులో అనుకున్నాడు.

'అయిపోయిందా?'

'అవునుబాబూ! జేబీలోని నెక్కల మిషను తీసి నెక్కేయండి...'

'ఎన్ని తలకాయలొచ్చేయ్?'

'తెలుగు నాలుగొందల ఏపై... వింగ్లీషు నాలుగొందల అరవై మూడు...'

తప్పు! తెలుగు అయిదువందల యాభై! ఇంగ్లీషువికూడా అంతే!'

'తలకాయలు మీముంగలే వున్నాయ్... నెక్కెట్టుకోండి...'

'చిన్న పేపర్లు తీసిబయటపడేసావ్... మద్ది మద్దిన రెండు మూడు తలకాయలు జతచేసి ఒకే ఒక తలకాయగా చేసేసావ్... అందుకే చిన్నవి తీసివేసి, పెద్దవి జత చేసి మామూలుగా కనిపించేలా చేసేసావ్... అందుకే తక్కువొస్తున్నాయ్...

"ఒక్కసిటాం! ఒంటిలోసుకొచ్చి మళ్ళీ మీ ముంగటే నెక్కెడతా!... నాను ఎనిమిదోక్లాసు మూడేళ్ళు సదివినా... తప్పు నెక్కెట్టు...' అని రమేష్ గేటుదాటి బయటకు వెళ్ళేడు.

భూమేంద్ర గుండ్రని కుర్చీలో గుండ్రంగా తిరుగుతూ రమేష్ కోసం ఎదురు చూస్తున్నాడు. కొంతసేపు చూసి గేటు దగ్గరకి వెళ్ళి చూశాడు. రమేష్ కనిపించనేదు.

భూమేంద్ర పకపక నవ్వుకుంటూ గేటు దగ్గర చాలాసేపు నిలబడ్డాడు.

నారద సలహా!

నిజం చెప్పడం చాలా తేలికైన వ్యవహారం!

ఎవరైనా చెప్పగలరు నిజం!

అబద్ధం చెప్పడమే కష్టం!

అబద్ధాన్ని నిజంగా చెలామణి చేయడం మరింత కష్టం!

ఆ మాటకొస్తే-

అబద్ధం ఒక ఆర్టు!

ఒక కళ! గొప్ప కళ!

మయ సభ నిర్మాణంలాటిది అబద్ధం! అది అందరికీ చేతకాదు. ఆ ఫీల్డులో బహుకొద్దిమందే ప్రవీణులుంటారు. అదుగో స్విమ్మింగు పూలంటారు. మనకంటికెక్కాడా నూటికి నూరుపాళ్ళు స్విమ్మింగు పూలుగానే ఎంతో ముచ్చటగా కనిపిస్తుంది! ఆ వైభవానికి ఎంతో ఆనందిస్తాం. సెభాష్ సెభాషంటాం. అంత అందంగా నిర్మించినందుకు మయుడ్ని మనసారా అభినందిస్తాం! జీతే రహో బేటా అని మయుడ్ని దీవిస్తాం! అతని భుజాన్ని మెచ్చుకోలుగా తడతాం!

ఇల్లాంటి తటాకంలో కాలు పెట్టని జన్మవృధా కదా అని కూడా అనుకుంటాం! అంచేత ఆ మాయదారి తటాకంలో కాలు పెడతాం!

కాళ్ళకి నీళ్ళు తగలవు. అచ్చం నీళ్ళ మాదిరి కనిపించే గచ్చు మాత్రమే వుంటుందక్కడ. ఆ మాటకొస్తే - అదంతా గచ్చుమయంగా తెలుస్తుంది!

కాలు పెట్టేం గనక సరిపోయింది గానీ -

దూకితే ఏమైపోయేవాళ్ళమో గదా?

ఏమవుతుంది-

ముక్కు పచ్చడయ్యేది! మూతిపళ్ళు రాలిపోయేవి! దూకుడు స్పీడు ఎక్కువగా వుంటే ఆసుపత్రిలో మంచం రిజర్వు చేసుకునే అవసరం కలిగేది!

అది వేరే విషయం-

అసలు సిసలు గచ్చునేలని పవిత్ర గంగగా మార్చిన ఆ యొక్క అద్భుత శక్తి పేరేమిటి? అబద్ధం!

అబద్ధాలు కొలను వంటి నిర్మాణానికి మాత్రమే సరిపోతాయని సరిపెట్టుకోడానికి వీల్లేదు. కోటగోడలు కూడా తయారు చేస్తాయి!

అబద్ధం చెప్పడం ఆషామాషి వ్యవహారం కానేకాదని ముందేమనవి చేసేను. హరిశ్చంద్రుడు మేలు జాతి చక్రవర్తిగా కీర్తి గడించవచ్చు! రాజ్యాలు ఏలుబడి చేసిన పెద్ద మనిషే కావచ్చు! జయహో సత్యహరిశ్చంద్ర చక్రవర్తీ అని సమస్తమైన వాళ్ళచేత జేజేలు దశదిశలా మారుమోగేలా పిలిపించుకోవచ్చు!

అల్లాంటి హీరో-

ఎంత గింజుకున్నా అబద్ధం చెప్పలేకపోయేడు!

అంత పెద్ద చక్రవర్తికే అబద్ధం చెప్పడం చేతకాకపోయినప్పుడు - ఆఫ్టరాల్ సగటు మనుషులం - మనమెంత అని బెంగపడటం పొరపాటు! నిజమే చెప్పడం ఆ చక్రవర్తి హాబీ అని భావించాలి! లేదా - అబద్ధం చెప్పడమనే ఆర్టు అతనికి తెలీదని గుర్తించాలి! నిజం చెప్పడంలో పెద్ద కష్ట పడక్కర్లేదని కూడా ముందే మనవి చేసేను. చాలా ఈజీగా చెప్పచ్చు. జరిగింది చెప్పడమే కదా! కాపీ కొట్టి కథ రాయడం లాటిదన్నమాట!

అందులో పనితనం గానీ ఆర్టుగానీ ఏమున్నాయి నా బొంద? సూర్యుడు తూర్పున ఉదయించి పడమర దిక్కున అస్తమించేడని చెప్పడానికి సాక్షాత్తు హరిశ్చంద్రుడే దిగి రావాలా? అప్పల్సామిని అడిగినా అదేమాటంటాడు!

అబద్ధం అట్లా కాదుగదా!

అబద్ధం చెప్పడానికి దమ్ములుండాలి!

దిట్టమైన బ్రెయినుండాలి! కల్పనాశక్తి అమోఘమైన స్థాయిలో వుండి పండాలి! అబద్ధాల్లో ఎన్ని రకాలున్నాయో వదిలేయండి! ఇంటో చెప్పే అబద్ధానికి డిమాండెక్కువ! ఏమి చెప్పినా నమ్మే మనిషి పేరు - భార్య!

అంచేత ఆమెకు నిజం వినిపించి కష్టాలు కొని తెచ్చుకోడం కంటె సంసార పక్షమైన అబద్ధాలు చెప్పి సుఖపడటం మేలంటాడు మా దూరబ్బంధువు!

అబద్ధాలు ఎక్కడ ఫెయిలైనా ఇంట్లోమాత్రం ధన్‌ధనామని పేలుతుంటాయి. వాటికి తిరుగుండదు. ఇంట్లో చెప్పే అబద్ధాలకు అద్భుతమైన ఆర్టుగానీ మేలురకం పనితనంగానీ అవసరముండదు. ఇల్లు చేరుకునే ముందు - చెప్పబోయే అబద్ధాన్ని ఒకటికి రెండు తడవలు రిహార్సలు చేసుకుంటే చాలు!

అయితే ఒక్కటి -

చెబుతున్న కథలో తికమకలుండకూడదు. ఎక్కడా ఆగిపోకూడదు. ఆధారాలో ఏపాటి అవకతవకలున్నా - ఆమెకు ఆలోచించే అవకాశం దొరుకుతుంది! ఆ ఛాన్సు దొరగ్గానే - ఆమె కొన్ని ప్రశ్నలడుగుతుంది. అవతల్నించి ప్రశ్నల వర్షం కురుస్తున్నప్పుడు - అతను చెప్పే కథ సవ్యంగా సాగదనీ ఇది ప్రతి భర్తా గుర్తించవలసిన పాయింటని ఆ బంధువే ధర్మసూత్రమొకటి చెప్పేడు!

ఈ సూత్రాలు నాకెందుకు చెబుతున్నారని అడిగేను. చిరునవ్వు నవ్వేసి నేను నారద మహర్షి టైపన్నాడు. అంచేత మగలక్షణాలు సొంతం విని జాగ్రత్త పడమన్నాడు. కూరల మార్కెట్లో బేరాలాడటం మగాడికి గిట్టదు. నామోషీగానే వుంటుంది. అంచేత బేరమాడకుండానే చెప్పిన రేటుకి కూరలు కొనేసి సైకిలెక్కినంతవరకు ఆ పెద్దమనిషి కరెక్టే!

ఇల్లు చేరుకునేముందు కొన్ని అత్యవసర నిర్ణయాలు తీసుకుంటాడు. వాటిల్లో భాగంగా అసలు ధర చచ్చినా చెప్పడు. సగానికి సగం ధర తగ్గించి చెబ్తాడు. అంత చవకగా ఎట్లా ఇచ్చేరని వాళ్లావిడ అడుగుతుంది. నా మొహం చూస్తే అంతే - ఎవరైనా చవగ్గానే అమ్ముతారనే అద్భుతమైన పాయింటు చెప్పి ఇల్లాల్ని ముగ్ధురాలిని చేస్తాడు!

అతని చవక టెక్నిక్‌కి ఇల్లాలు చప్పున పడిపోతుంది. భగవంతుడా - నాకు చవక భర్తని చవగ్గా ప్రసాదించి ఆదుకుంటున్నందుకు కృతజ్ఞతలు అని ఆమె కేలెండరు దేవుడికి చేతులు జోడిస్తుంది. వచ్చే జన్మక్కూడా ఈ చవక శాల్తీనే భర్తగా అనుగ్రహించమని మొక్కుకుంటుంది! ఈ పిచ్చి పనులకు స్వస్తి చెప్పి - ఏ రేటుకి కొని ఏ రేటు ఇంట్లో చెబుతున్నాడో కూపీలాగమని నాకు హితబోధ చేసేడు మా దూరబ్బంధువు! అతను ఎంత నారద మునీంద్రుడి టైపు మనిషైనా - మనకి చాలా అవసరమైన సలహా యిచ్చేడు! అంచేత అతని సలహాని మీరు కూడా పాటిస్తే బావుంటుందనే ఉద్దేశంలో - అతను చెప్పినమాట మీ చెవినేస్తున్నాను! ●

ముందస్తు మస్తు...! మోక్షం తుస్సు

"అన్నా... ఓ అన్నా... ఇంగనావల్ల కాదంటే కాదు!" నారిగాడి భార్య వురికి వచ్చేసరికి యాద్గిరి వింతగా చూశాడు. తాగుతున్న బీడీ దూరంగా విసిరేశాడు." ఏందే... ఏంది కథా... నారిబాబు మళ్ళా నడుం మీద రెండు తగల్నిచ్చిండా.. ఛ... ఛ... వాడికి బుద్ధిరాదే.... ఎన్నిసార్లు చెప్పినా వాడా తాగుడు మానడు... పాడు!" యాద్గిరి చీత్కరించాడు.

"అదికాదె అన్నా... తాగుడు... ఇంట్లె వీరంగం ఇవన్ని పాత సంగతులు... అదికాదు – ఇపుడు మరోకొత్తపాట అందుకుని ఒకటే సోదికి తగులుకున్నాడు. అమ్మో! కాలుకు పెడితే మెడకు... ఇంగ నావల్ల కాదంటే కాదు!" ఆవిడ రాగానికి తగులుకోబోతే జక్కులోడు గదిరించాడు.

"యహె... వల్లకాదేంది... అసలు సంగతేందో మిడకరాదె!" అని విసుక్కున్నాడు.

"వాడు... వాడు సన్యాసుల్లో... బైరాగుల్ల కలిసి పోతాడట. మమ్మలందర్ని వదిలిపెట్టి..." యాద్గిరి ఒక్కసారిగా విరగబడినవ్వాడు. వాడికీ ఆలోచన వింటానికే పరమ వింతగా వుంది. సొంపుగానూ వుంది.

"చాల్చాల్లే... బాగుందె... సన్యాసుల్లో... బైరాగుల్లో..." జక్కులోడు కిసకిస నవ్వడంతో ఆవిడ కూడా తెప్పరిల్లి నవ్వుకు తగులుకుని కాస్తంత శాంతించింది! "అరె... జర అట్ల కూర్చో... ఇపుడు నిమ్మలంగ సంగతి చెప్పు... మన బాబుబావ సన్యాసుల్లో కలిసిపోతాడు. వారెవా... ఇంకా...!" యాద్గిరి మరోబీడీ వెలిగించాడు.

"పొద్దున పొద్దున్నే వడ్ల వీరాచారి దగ్గర పోయి దండకర్రోటి చేయింపించిండు. పాత రాగి చెంబు సొట్ట దీసి కమండలం చేయిస్తాడట! అన్నయ్యా.. మరింక చెక్క పాంకోల్లు... గవేందో అవి కూడా చేయిస్తాడట!" ఆవిడ మొగుడి గురించి నవ్వుతూనే చెప్పింది. జక్కులోడికి చిలిపి ఆలోచనే వచ్చింది అది సరేగాని చెల్లే... మరి బవిరి గడ్డం ముచ్చటా... గా సంబరం తీరాల్నంటే నాతాన తోలు... ఇంట్లో గోగునారుంది. తెల్లటిది! ఓ వాటెడు బావకు వుత్తగనే ఇస్తా – పురికొసతోని కుట్టి గెడ్డం తగిలిచ్చుకోమను. భలే రంజుంటది! బవిరిగెడ్డం బాబుబావ... హహ్హహ్హా...!" జక్కులోడు అంతూపొంతూ లేకుండా నవ్వుకు తగులుకున్నాడు.

'అరె... జరాగర... అసలు సంగతేందో కనుక్కుంటె పోలా.. సరెగాని చెల్లె... అసలేం జరిగిందే... ఎందుకటా!" ఆప్యాయంగా అడిగాడు.

"అదికాదె అన్నా... మనింటి పక్కన తోటబావుంది గద... దాన్లో ప్రతి ఏడు మొక్కజొన్న వేస్తన్నం... మోటకట్టి బావిల నీళ్ళుంటే పెడతన్నం... గవి పితపు కంకులేనాయె! ఏదో పోరగాండ్లు తింటానికైనా పదిపదేను గంపల్దాకా ఎలతన్నయిగద..."

"అవునవును... మొక్కజొన్న కంకులు" – జక్కులోడు నవ్వాపాడు.

"పోయిన అయిదారేండ్ల నుండి పాడు నక్కలు వాటికి అలవాటాయె... సందుదొరికినపుడెల్ల జొరబడి కసాపిసా కంకులు కొరికి పారేస్తుండె!"

"ప్చ్... ప్చ్... ఈ నక్కలు పాడుగాను" యాద్గిరి విచారాన్ని ప్రకటించాడు.

"గా నక్కల గురించి అందరికి చెప్పుకున్నం... ఎవడు మాత్రం ఏం చెప్తడు? గవి నక్కలేనాయె – కొత్తగాదుగద! వూర్లె అందరి తోటల్లోనూ పడిపాడు చేస్తన్నయి గద అని నేనంటిని. మన పక్కింటి రాజన్న... ఎదురింటి గోపన్న అందరూ అదే మాట అంటు న్నరు గద!"



"మరి నంగతికరాడా అంతేగద!"

"ఆహా... వాళ్ళందరూ నక్కలకు మద్దతు పలుకుతంద్రు – ఒక్కడుకూడా గీ నక్కల పని పట్టడానికి తనలోని కలిసిరాటం లేదనిగా పదిరోజులు... గదే మొన్నటి అమావాస నుండి ఒకటే అల్లరి...!"

"అమావాసంటె... వాడి తిక్కగాని తిరగబెట్టినాదె!" జక్కులోడు భయంగా అన్నాడు.

"తిక్కకాదు... పాడుకాదు... జక్కన్నా... అమాసరాత్రి అన్నాలు తిని అందరం పడుకొన్నాం. నిదర పట్టటం లేదో, తోటల్నుండి ఏదో ఊళ వంటిది వినబడింది. అప్పటికీ నేను 'వద్దు–వద్దయ్యా–చీకటివేళ' అని అంటూనే వున్నా... మరి ఈయనగారేమో గోచీ బిగించి బాణ కర్రందుకుని బేట్రిలైటేసుకుని తోటలోకి సీకట్లోనే బిరబిరా బోయిండా... అంతే..."

"ఏమయిందే?" జక్కులోడు ఆదుర్దాగా అడిగాడు.

"ఏందో పాడు– మరి అదినక్కో – కుక్కో – బజారుదాటీ దాటంగనే, మరి ఈయన దాని కాలో, తోకో చీకట్లో తొక్కినట్లుంది. పెడాల్మని పిక్కపట్టి పీకింది – రగతం కారుతుంటే అరుచుకుంట ఇంట్లో వచ్చిపడి బూతులకు తగులుకున్నాడు. మన రాజన్న, గోపన్నలు కూడా వురికి వచ్చి కట్టుగట్టి దయిర్నం చెప్పిపోయిరి! భలే... ఈ నక్కలకూ... కుక్కలకూ వాండ్లు కూడా మద్దతంటడేందే!"

జక్కులోడు మళ్ళా నవ్వుకు తగులుకుని చప్టామీద పొర్లి... పొర్లి నవ్వడం... యాద్గిరి కాంద్రించి మరో బీడీ వెలిగించాడు.

"అదికాదె... మొక్కజొన్న తోటల నక్కలు జొరబడి కంకులు కొరికి పారేస్తుంటే జాగర్త పడాలె – చుట్టు కంచె గట్టుకోవాలె – మంచెవేసుకుని కాపలా కాయాలె – జక్కులోడు మాట ముగించె లోపునే మటమటలాడుతూ రాజన్న గోపన్నలు వచ్చి వుస్సురని కూలబడ్డారు.

"అరె యాద్గిరీ... మీ నారిబాబు సంగతి బాగ లేదుర... అరె... వారం దినాల్నుండి మమ్మల్ని ఒకటే బూతులు... మాపని చేసుకుని మా బాధలు మేం పడతావుంటే వాడి లొల్లేందిర! ఏందమ్మా... నువ్వా వున్నావుగ! మరి నీ పెనిమిటి మాటేంది – అట్లా మమ్మల్ని అరుచుడేంది?" రాజన్న ఛీత్కరించాడు.

ఏమయింది రాజన్న – ఏమంటాడు" యాద్గిరి సముదాయింపుగా అన్నాడు.

"ఏవుందీ... ఆ నక్కల సంగతి అందరం కలిసి చూడాల్నంటాడు. సరె... అందరం కూకుని ఏదో మంచీ – చెడూ మాట్లాడి వాడిపీడ వదిలిద్దాం.. "అన్నాంగదే!" అహహఁ... తోటలోపడి ఇరగదొక్కడానికి మేం జవాబియ్యాలట... మరి మాతోటల్ని మాత్రం అవి బతకనిస్తన్నయా... మొండెం దాక కొరికిపారేస్తుండె! అసలు అటు ఆ చెరువు కాడ్నుంచి వాటికి మంచి వనరుంది. గుట్టరాళ్ళు – తొర్రలు. వాట్ని కట్టడి చేస్తే వీటి గోలుండదు రా అంటే వినడు." రాజన్న ఎగశ్వాస పీల్చి అన్నాడు. వెంటనే గోపన్న అందుకున్నాడు.

"మరింగ దానికారణంగ సన్యాసుల్ల కలుస్తనని తయారయిండు. దానికి కారణం ఏమంటడు. ఇంగో ముత్తమ్మా... అసలు సంగతి నీకు తెలవదు. నీకుతెలవకుండా నీ మొగడు యాడబడితే ఆడ... పిచ్చపిచ్చగ అప్పులు చేసిండు. వెంకట్రావుడి బెల్టు దుకాణంలో ఒకటే తాగుడు.... పీకల్దనక అప్పులు... అందుకే ఈ ఎత్తు ఎత్తిండు..

ముత్తమ్మ నిర్ఘాంతపడి వింటుంది.

"యాద్గిరన్నా... వాడు సన్నాసుల్లో కలిసినా... నాటకం ఆడినా అప్పులిచ్చిన జనం తన్ని పూర్నించి తరమడం ఖాయం – ఏదో నక్క గీకిందనీ... కుక్క గోకిందనీ చెప్తే ఎవనికి జాలి – ఇన్ని దినాల్నుండి లేని ఆ నక్కల బాధ ఈ రోజొచ్చి పడిందా? పోనీ రేపు సన్యాసం పుచ్చుకుంటే అవి వాటి పని మానతయా... మమ్మల్నెందుకు మరి...

"అహఁ... అసలు తాను బైరాగి కావటానికి మీరందరూ కారణమని వూరూర తిరిగి కూడా చె...ప్త... డ...ట!"

దూరంగా పూర్తి కాషాయంలో దిగిన నారిబాబు పాంకోళ్ళు టకటక లాడించుకుంటూ కుంటుకుంట ఇటే వస్తున్నాడు! ●

డా॥ కె.ఎల్.వి.ప్రసాద్

దంతాల ఆరోగ్యమే మన ఆరోగ్యం

"సీతా! నువ్వేమి అనుకోనంటే ఒక విషయం చెప్పవోయ్" అన్నాడు లక్ష్మీపతి.

"అదేంటి కొత్తగా మాట్లాడుతున్నారు. మీరేమి చెప్పినా నా మంచికోసమే కదా చెబుతారు" అంది 'చెప్పండి' అన్నట్లు.

"అది నిజమేననుకో! ఒకవేళ నేను చెప్పిన విషయం వల్ల నీకు బాధ కలిగిందనుకో అన్ని రకాలుగా నన్ను ఉపవాసం ఉంచేస్తావు కదా!" అన్నాడు కాస్త కొంటెగా.

"అబ్బ!! మీ దగ్గర ఉన్న జబ్బే ఇది. సంగతి చెప్పకుండా ఏమిటి ఈ కబుర్లు - కాలయాపనాను" అంది కాస్త విసుగ్గా లక్ష్మీపతి భార్యారత్నం శ్రీమతి సీత.

"అదేనోయ్! చాలా కాలంగా చెబుదామనుకొంటున్నా కాని, నువ్వెక్కడ బాధపడిపోతావోనని ఇన్నాళ్ళు సంశయించాను. 'ఇక తప్పదు. లేకుంటే వేరే వాళ్ళ చేత చెప్పించుకోవడం బాగుండదు సుమా!"

"అబ్బబ్బ!! మనిషిని చిత్రహింసలు పెట్టడం ఎప్పుడు నేర్చుకున్నారు మీరు. అసలు సంగతి చెబుతారా? లేక..."

"అ... అ... అంత పని చేయకు. చెబుతున్నానులే ఖంగారు పడిపోకు. అదే సీతా! నువ్వు నా దగ్గరగా వచ్చి మాట్లాడుతున్నప్పుడు నీ నోరు వాసన వస్తుందోయ్. అదే.. నోటి దుర్వాసన అంటారు చూశావా... అదే!!" అన్నాడు లక్ష్మీపతి మామూలుగా.

"నిజంగానాండీ! ఇలాంటివి చెప్పడంలో ఆలస్యం చేయకూడదండీ విషయం తెలిస్తే అలా కాకుండా చూసుకుంటాంగాని, బాధ ఎందుకు పడ్తాను. నేను కూడా ఒక పొరపాటు చేశానండి ఇంతకాలం..." అంది లక్ష్మీపతి ముఖంలోకి చూస్తూ సీత.

"అంటే... నానోటి నుండి కూడా... " అన్నాడు అనుమానంగా.

"అవునండీ, నేను కూడా మీరు బాధపడ్తారనే చెప్పలేదు" అంది మెల్లగా.

"చూశావా, ఇద్దరం ఈ విషయం గ్రహించి కూడా ఒకరికొకరం చెప్పుకోలేదు. మన గురించి లోలోపల ఎంతమంది చెప్పుకుంటున్నారో" అన్నాడు కాస్త బాధగా లక్ష్మీపతి.

ఇలాంటి సంఘటనలు ఇంచుమించు ప్రతి ఇంటిలోను, భార్యాభర్తల మధ్య, స్నేహితుల మధ్య జరుగుతూనే ఉంటాయి. నోటి దుర్వాసన వంటి



సమస్యను ఎదుటివారు గ్రహించినపుడు అవహేళనగా, అసహ్యించుకున్నట్లుగా కాక, సున్నితంగా చెప్పగలిగితే, అది ఒక మంచి పని చేసిన దానితో సమానం. చెప్పకుండా ఉండడం, లోలోపల అసహ్యించుకోవడం మంచి పద్ధతి కాదు. అది ప్రేమకు లేదా స్నేహానికి నిర్వచనం కాదు.

భార్యాభర్తల్లో, స్నేహితుల్లో, బంధువుల్లో, ఇతరుల్లో నోటి దుర్వాసన రావడానికి గల కారణాల్లో పంటిపాచి (ప్లాక్) లేదా పంటిగార (టార్టార్) ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఈ పాచి లేదా గార రావడానికి ముఖ్య కారణం నోటి పరిశుభ్రతలో (దంతధావనం వగైరా) లోపమే!

చాలా మంది గంటల తరబడి పళ్ళు తోముకొని, తాము చాలా మంచిగా బ్రష్ చేసుకుంటున్నామనుకుంటారు. మరికొంతమంది గట్టిగా హార్డ్‌బ్రష్‌లతో పళ్ళు తోముకొని, పళ్ళు తోముకోవడంలో తమకు మించిన వారు లేరనుకుంటారు. అదే విధంగా పంటి పుల్లలతో పళ్ళు తోముకొనే వాళ్ళు ఒకేచోట అదేపనిగా పళ్ళు తోముకుంటూ తాము అసలైన పద్ధతిలో పళ్ళు తోముకుంటున్నట్లుగా భావిస్తారు. బ్రష్‌లు

జలుబుకు గృహ వైద్యమే మేలు

జలుబు తగ్గడానికి తేలికపాటి గృహ చిట్కాలు, రవంత సహనం ఉంటే చాలంటున్నారు జర్మనీ డాక్టర్లు. జలుబు చేయగానే కొందరు ఆసుపత్రికి పరుగెత్తుకొస్తారు. జలుబు మందు వాడితే ఏడు రోజులకు, వాడకుంటే వారానికి తగ్గుతుందని మనవాళ్ళు కూడా అంటుంటారు గదా! అయితే మందుల వల్ల జలుబు తాత్కాలికంగా తగ్గినా మరలా రెండు వారాలు తిరగకుండానే వస్తుందని జర్మనీకి చెందిన జనరల్ ప్రాక్టీషనర్ పీటర్ లా అంటున్నారు. ముక్కు దిబ్బడ, దగ్గు తగ్గాలంటే పడుకోబోయే ముందు ఆవిరి పట్టడం మంచిదని ఆయన చెబుతున్నారు. యూకలిప్టస్ నూనె, పసుపు వంటి వాటిని వేడి నీటిలో కలిపి ఆవిరి పడితే జలుబుకు చక్కటి ఉపశమనం లభిస్తుంది. ఇంట్లో చేసుకొనే చిట్కాలు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఉపశమనాన్ని ఇస్తాయని వారంటున్నారు. జలుబు చేసినపుడు శరీరం అత్యధికంగా మ్యూకస్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీనివల్ల వ్యాధి క్రిములు అత్యధికంగా బయటికి వెళ్తాయి. అత్యధికంగా ద్రవ పదార్థాలను తాగడం ద్వారా ఈ ప్రక్రియకు మరింతగా దోహదం చేయాలి. రోజుకు కనీసం మూడు నాలుగు లీటర్ల ద్రవ పదార్థాలను తీసుకోవాలి. ఆల్కహాల్ కానంత వరకూ ఏ ద్రవాన్నయినా తీసుకోవచ్చు అంటున్నారు డాక్టర్ లా. అయితే ఘాటైన మందులను ఎట్టి పరిస్థితిలోనూ తీసుకో వద్దని ఆయన సలహా ఇస్తున్నారు. యాంటీ బయాటిక్స్‌ను కేవలం డాక్టర్ సలహా మీదనే తీసుకోవాలి. విటమిన్లు అత్యధికంగా ఉన్న ఆహారాన్ని తీసుకోవడం, వ్యాయామం చేయడం ద్వారా కూడా దీనిని ఎదుర్కోవచ్చు అంటున్నారు డాక్టర్ లా.

కొనగలిగే స్థితిలో వున్నా ప్రకృతిసిద్ధమైన చేతివేలు ఉండగా, ఈ బ్రష్‌లకు డబ్బు తగలేయడం ఎందుకు? అనుకొనే వాళ్ళూ వున్నారు. ఇలాంటి ఆలోచనా విధానం ఉన్న వాళ్ళందరిలోనూ, పంటి పరిశుభ్రతలో లోపం కన్పిస్తుంది. తద్వారా పంటిలో కొన్ని ప్రాంతాలు లేదా భాగాలు పరిశుభ్రతకు నోచుకోవు. దాని ఫలితమే పంటిమీద పాచి నిల్వ ఉండడం. ఈ విధంగా నిల్వ వున్న 'పాచి' పరిశుభ్రతకు నోచుకోకపోయినట్లయితే, అది గట్టిపడి 'గార'గా మారుతుంది. అప్పటికి సరైన జాగ్రత్తలు పాటించకపోతే యిదే గార (TARTAR) చిగుళ్ళను వ్యాధిగ్రస్తం చేస్తుంది. ఆ తర్వాత చిగుళ్ళు వాచి ఎర్రగా మారడం, విపరీతమైన నొప్పి కలగడం, చిగుళ్ళ నుండి కొద్ది తాకిడికే రక్తస్రావం జరగడం ఆ తర్వాత చిగుళ్ళ నుండి చీము - నెత్తురు స్రవించడం, నోటి నుంచి దుర్వాసన వెలువడడం, జ్వరం రావడం, ఆహారం తీసుకోలేని పరిస్థితులు ఏర్పడడం, నీరసించి పోవడం వంటివి ఒకదాని తరువాత ఒకటి జరిగే పరిణామాలు.

చిగుళ్ళలో గార వల్ల వ్యాధి సంభవించి, ఎన్నో పరిణామాలు సంభవించిన నేపథ్యంలో వ్యాధి వల్ల పంటిని, పంటి ఎముకతో గట్టిగా పట్టి ఉంచే బంధం సడలిపోవడం వల్ల పళ్ళు కదిలిపోవడమే కాక ఒక్కోసారి చీము నెత్తురులో తేలుతుంటాయి.

పళ్ళు సరిగా తోముకోకపోవడం వల్ల ఎదురయ్యే సమస్యలను సకాలంలో పట్టించుకోకపోయినట్లయితే, పళ్ళు కదిలిపోయే ప్రమాదం ముంచుకొస్తుంది. కనుక ఈ పరిస్థితికి కారణమైన పంటిగార గురించి కొంచెమైనా తెలుసుకోవాలి.

ముఖ్యంగా పంటిగార రెండు రకాలుగా ఉంటుంది. అంతర్గతమైన గార, ఉపరితల గార అన్నవే ఈ రెండూను. అంతర్గతమైన గార మనం చూడ్డానికి కన్పించదు. కారణం ఏమంటే ఇది పంటికి - చిగురుకు మధ్యభాగంలో ఒక పలుచని పొర మాదిరిగా లోలోపలే వ్యాధిని పెంచుతూ ఉంటుంది.

రెండవ రకం ఉపరితల గార. ఇది పన్ను - చిగురు కలుసుకొనే ప్రాంతంలోగాని, పూర్తిగా పంటి ఉపరితలం మీద అంటే పింగాణి పొరను ఆక్రమించుకొని ఉంటుంది. ఇది చూడ్డానికి గోధుమరంగులో గాని, మట్టిరంగులోగాని,



లేతఆకుపచ్చ రంగులోగాని ఉంటుంది. ఈ రెండు రకాల గార వల్ల కూడా చిగురు వ్యాధిగ్రస్తం కావడం, తద్వారా అది పంటిమూలం చివరి వరకు చేరుకోవడం, చిగురువాపు, నొప్పి, పన్ను కదిలిపోవడం వంటివి వరుసగా జరిగిపోతుంటాయి. ఒక్కోసారి భరించలేని నొప్పితో పాటు, జ్వరం, నీరసం, ఆహారం తీసుకోలేని పరిస్థితి కూడా ఏర్పడుతుంది.

అయితే, ప్రాథమిక దశల్లో కనుక ఈ 'పాచి'ని గాని, 'గార'ను గాని గమనించి సకాలంలో తగిన చికిత్స చేయించుకుంటే, చిగురు వ్యాధిని తగ్గించవచ్చు. తద్వారా పంటి ఎముక కరిగిపోకుండా పన్ను కదలకుండా జాగ్రత్త పడవచ్చు.

చికిత్స : పంటిగార, దాని స్థాయిని బట్టి, వ్యాధి ఉధృతిని బట్టి చికిత్సా విధానాలు ఉంటాయి. అందులో మొదటిది స్కేలింగ్, ఆ తర్వాతది 'రూట్ ప్లేనింగ్'. ఆఖరి అస్త్రం 'ఫ్లాప్ ఆపరేషన్'.

చికిత్సకు ముందు : చికిత్సకు ముందు కొన్ని పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవలసి ఉంటుంది. వీటివల్ల



అంతర్గత సమస్యలు బయటపడతాయి. చికిత్సకు, ఆ తర్వాత తగిన జాగ్రత్తలు తీసుకునే అవకాశం కలుగుతుంది. వినియోగదారుల ఫోరంలు బలపడుతున్న నేపథ్యంలో ఈ పరీక్షలు తప్పనిసరి అవుతున్నాయి. పేద ప్రజానీకానికి ఇది ఇబ్బంది అయినప్పటికీ తప్పడం లేదు.

ముఖ్యమైన పరీక్షలు : ఎక్స్-రే ఫిల్ములు, రక్తపరీక్షలు, మూత్ర పరీక్షలు చెప్పుకోదగ్గ పరీక్షలు. ఎక్స్-రే వల్ల దవడలోని పంటి ఆరోగ్య పరిస్థితి, దవడ ఆరోగ్య పరిస్థితి తెలుసుకునే అవకాశం ఉంది. రక్త పరీక్షల వల్ల రక్తహీనత, రక్తసంబంధమైన వ్యాధులు బయటపడి, ప్రాణాపాయం నుండి రక్షించుకోవడానికి వీలు కల్పిస్తాయి. రక్తసంబంధమైన వ్యాధులకు సంబంధించి, రక్తహీనత, హిమోఫీలియా, ల్యుకేమియా (రక్తపు క్యాన్సరు) వంటి వ్యాధులు ఉన్న వారు ఇతర శస్త్రచికిత్సలు చేయించుకుంటే ప్రమాదం ఏర్పడుతుంది. వీటితో పాటు, బ్లీడింగ్ టైమ్, క్లాటింగ్ టైమ్, హిమోగ్లోబిన్ శాతం వగైరాలు చూడవలసి ఉంటుంది. రక్తపోటు ఉన్నవారు కూడా పళ్ళకు సంబంధించిన లేదా చిగుళ్ళకు సంబంధించిన శస్త్రచికిత్సలు వాయిదా వేసుకోవడమే మంచిది.

శస్త్ర చికిత్సలు చేయించుకునే ముందు చేయించుకోవలసిన మరొక ప్రధానమైన పరీక్ష మూత్ర పరీక్ష. ఈ పరీక్ష ద్వారా మధుమేహ వ్యాధి గనక ఉన్నట్లు కనుగొంటే అది సాధారణ స్థితికి వచ్చేవరకు చికిత్సను వాయిదా వేసుకోవలసి ఉంటుంది. అంటే ముందు మధుమేహ వ్యాధికి చికిత్స చేయించుకోవాలన్నమాట! కనుక ఈ పరీక్షల అవసరం అధికంగా ఉండడం వల్ల వీటిని చేయించుకోవడానికి ఏ విధంగాను సంశయించకూడదు.

పంటిగారకు చికిత్స : పంటిమీద ఉన్నగారను సున్నితమైన చేతి పరికరాలతో గాని, ఎలక్ట్రానిక్ యంత్రాల ద్వారా గాని తొలగించడం జరుగుతుంది. అంటే పరిశుభ్రం చేయడం జరుగుతుంది. ఈ చికిత్సను 'స్కేలింగ్' అంటారు. అదే విధంగా పంటికి - చిగురు పొరకు మధ్య ఉన్న గారను కూడా సున్నితమైన పరికరాల ద్వారా, నొప్పి లేకుండా పరిశుభ్రం చేస్తారు. దీనినే 'డీప్‌క్యురటాడో' అంటారు. దవడలో వున్న పంటి మూలాన్ని కూడా 'గార' పట్టి ఉన్నట్లయితే దానిని కూడా శస్త్రచికిత్స ద్వారా పరిశుభ్రం చేయడం జరుగుతుంది. దీనినే 'రూట్‌ప్లేనింగ్' అంటారు. చిగురు వ్యాధి ఉధృతమై, దవడ ఎముక భాగం కొంత కరిగిపోవడం జరిగితే, ఫ్లాప్ ఆపరేషన్ ద్వారా కొంతమేలు జరుగుతుంది.

అయితే పరిస్థితిని బట్టి ఎప్పుడు ఎలాంటి చికిత్స చేయాలన్నది దంత వైద్యులే నిర్ణయిస్తారు. వైద్యులకు పూర్తి సహకారం అందించడం ద్వారా ఫలితాలు వేగవంతంగా అందుతాయి.

అపోహలు : పంటిపై పేరుకుపోయిన 'గార'ను తొలగిస్తే పళ్ళు కదిలి పడిపోతాయనేది కొందరి నమ్మకం. కాని ఇందులో ఏ మాత్రం యదార్థం లేదు. ఇది కేవలం మూఢ నమ్మకం మాత్రమే! స్కేలింగ్ చేయించుకోవడం వల్ల, సంబంధిత ఇతర శస్త్ర చికిత్సలు చేయించుకోవడం వల్ల కొంచెమైనా మేలు జరుగుతుంది తప్ప నష్టం కలుగదు. శస్త్రచికిత్స జరిగే నాటికి పంటి కదలిక ఎక్కువగా ఉంటే స్కేలింగ్ తరువాత కూడా గట్టిపడే అవకాశాలు తక్కువగా ఉంటాయి.

అయితే, గారను తొలగించే విషయంలో, అది స్కేలింగ్ అయినా ఇతర శస్త్రచికిత్స అయినా, అది పళ్ళు శుభ్రంగా ఉండడానికి, గట్టిగా కావడానికి మాత్రమే కాదు. గారద్వారా గాని, గారవల్ల ఏర్పడ్డ చిగురు వ్యాధి ద్వారాగాని, ఆయా వ్యాధులకు సంబంధించిన విషపదార్థాలు, రక్తప్రసారం ద్వారా ఇతర ముఖ్య శరీర భాగాలకు చేరి ఆయా భాగాలను వ్యాధిగ్రస్థం చేసే అవకాశం ఉంది. గుండె, మూత్రపిండాలు, జీర్ణవ్యవస్థ, ఎముకల కీళ్ళు వంటి కొన్ని శరీర భాగాలు వ్యాధిగ్రస్థం కావడానికి అవకాశం ఉంది. ఇలా ఒక సమస్య వల్ల, శరీర ఇతర భాగాల్లో మరో సమస్య ఉత్పన్నం కావడాన్ని ఫోకల్ ఇన్‌ఫెక్షన్ అంటారు.

వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని, నోటి పరిశుభ్రత విషయంలోను, దానికి అనుబంధమైన పంటి పరిశుభ్రత విషయంలోను, శాస్త్రీయ అవగాహనతో, పళ్ళమీద పాచి-గార ఏర్పడకుండా చూసుకోవాలి. ఒకవేళ అప్పటికే అది ఏర్పడినట్లు గమనిస్తే తక్షణం దానికి తగిన చికిత్స చేయించుకోవాలి.

ఒక పద్ధతి ప్రకారం దంతవైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా, అది ఇక పంటి సమస్యలను, తద్వారా ఉత్పన్నమయ్యే చిగురు సమస్యలను దరిరాకుండా కాపాడుకోవచ్చు. బ్రతికినంతకాలం ఆరోగ్యమైన దంతాలను కలిగి ఉండడం క్రమశిక్షణ గల జీవితానికి నిలువెత్తు సాక్ష్యం. ఇలాంటి వారిలో నోటిదుర్వాసనకు తావేలేదు. ●

గ్రామీణ సంక్షోభానికి సజీవ దర్పణం

ఇటీవలి కాలంలో ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల ఫలితంగా ప్రజల స్థితిగతులు అతివేగంగా దిగజారిపోతున్నాయి. అట్టడుగు వర్గాల బ్రతుకులు మరీ దుర్భరమవుతున్నాయి. ఈ పరిణామం పట్టణ ప్రాంతాల్లో ఒక రకంగా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో మరోరకంగా ఉంటున్నది. ప్రాంతాలతో కూడ దీనికి నిమిత్తం లేదు. చిన్న చిన్న తేడాలుండవచ్చు, తీవ్రతలో మార్పులుండవచ్చు. కానీ ఈ పరిణామం స్వభావం అంతా ఒక్కటే. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందే క్రమంలో చేతివృత్తులకు కాలం చెల్లిపోయింది. రైతులు దివాళా తీసి భూములు కోల్పోయి కూలీలుగా మారిపోతుంటే, భూస్వాములు తమ భూములు మరింతగా పెంచుకుంటున్నారు. ఇప్పుడు కొత్తగా కార్పొరేట్ వ్యవసాయం, కాంట్రాక్టువ్యవసాయం రంగప్రవేశం చేస్తున్నాయి. గతంలో ఫ్యూడల్ పెత్తందార్ల జులుం కొనసాగితే ఇప్పుడు మారిన పరిస్థితుల్లో రూపాంతరం చెందిన గ్రామీణ పెత్తందార్లు మరో రూపంలో అంతకన్న తీవ్రంగా దాన్ని అమలు జరుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో బడుగుజనం బ్రతుకుబండి ఈడ్వడం దుస్సాధ్యమై పోయింది. ఈ పరిణామాలను "ఊటబాయి" కథాసంకలనంలో పెద్దింటి అశోక్ కుమార్ కడు హృద్యంగా వివరించారు. రచయితకు గ్రామీణ జీవితంతో ప్రత్యక్ష పరిచయం ఉంది. కథలన్నీ తెలంగాణా ప్రాంతానికి చెందినవి కాబట్టి ఆ మాండలికాన్ని వాడటం సహజత్వాన్ని సమకూర్చింది.

ఊటబాయి
కథలు
రచయిత : పెద్దింటి అశోక్ కుమార్,
ప్రచురణ : నయనం ప్రచురణలు, సిరిసిల్ల-505301.
వెల : రు. 100.
ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తకాలయాలు

పెట్టుబడులు భారీగా పెరిగిపోయి, ప్రభుత్వసాయం తగ్గిపోయి వ్యవసాయం ఏ మాత్రం గిట్టుబాటుకాక రైతు తేరుకోలేని అప్పుల పాలయితే, ఆ పైన వరుస కరువులు వచ్చిపడితే పరిస్థితి ఎలా ఉంటుందో తేలిగ్గానే ఊహించుకోవచ్చు. ఈ పరిణామం ఆర్థిక పరిస్థితి పైనే కాకుండా, మానవ సంబంధాలపై కూడ తీవ్రమైన ప్రభావం చూపుతుంది. ఈ పరిణామానికి దర్పణం "తండ్లాట" కథ. ప్రధాన పాత్ర ధారి రాములు ఇలా వాపోతాడు, "పైస పాడుగాను, చూసినావు. పాణమంటి సుట్టాన్ని పగచేత్తది. అట్టనా ఇట్టనా అంటలేదు సూడు. బాకీ ఎగవెడుతననుకుండా...? ఇద్దరు ఒకటే తల్లికి పుట్టిరి. ఒకటే జాగల పెరిగిరి. ఇప్పుడు చూడు. పద్మ కిస్మత్ ఎట్లుంది. మా కిస్మత్ ఎట్లుంది. దేనికైనా బాకీ కావాలె..." రైతుల పరిస్థితి ఇదయితే, గొర్లె కాపర్ల దయనీయ పరిస్థితిని "ఇగురం" కథ గుండెల్ని పిండేసేలా వివరిస్తుంది. "ఊరికి అడివికి మధ్య మంద. మందలో గొర్రెలా... మేకలా... ముడుచుకున్న గొల్ల. అటు అడివి జంతువుల కండ్లు, ఇటు ఊరి దొరల దొంగల కండ్లు మందమీదనే. తోడేలు తప్పితే దొంగలు, దొంగలు తప్పితే గోంద్రుగాడు. ఇవి తప్పితే అప్పుసప్పు ఇచ్చి ఆదుకున్న దొరలు. పైగా వచ్చే రోగాలు." చేతివృత్తి దారుల పరిస్థితికి దర్పణం "కాగుబొత్త" కథ. కుమ్మరి చేసే కుండలకు గిరాకీ లేకపోయినా, దేవుడి ఉత్సవంలో జనానికి నీళ్ళు పోయడానికి పెద్ద సంఖ్యలో భారీ కుండలు అవసరమని పెత్తందార్లు చెప్పిన మాటలు నమ్మి ప్రాణాలు బిగపట్టుకొని కుండలు తయారు చేస్తాడు వయసు మీరిన లింగం. తీరా అన్నీ పూర్తయ్యాక పెత్తందారు దగ్గరి కెళితే "అరే...ఆముచ్చట నీకు మొన్ననే చెబుదామనుకొని మర్చిపోయిన. ఈ జాతర చెయ్యవట్టి ఆగమాగమయింది. కాగులు కొంటే నాలుగయిదు వేలయితది. దాంట్లో నీల్లు తెచ్చి నింపుడుకు టాక్టరు కిరాయి గావాలె. మొత్తం ఏడెనిమిది వెయిల కర్చు. అయితమాయె పెడుదామనుకున్నం. మొన్ననే నీ కొడుకు వచ్చి అక్కడ నీళ్ల ప్యాకెట్లు అమ్ముకుంటనన్నడు. అమ్ముకున్నందుకు మాకే రెండువెయిలు ఇస్తన్నడు. అదే నయమనుకొని కమిటీ మెంబర్లు ఒప్పుకున్నారు." అంటూ చావుకబురు చల్లగా చెబుతాడు. కూలినాలి చేసుకునేవారి పరిస్థితి మరీ దారుణంగా మారింది. యాంత్రీకరణ ఉపాధిని హరించివేసింది. రైతుల కల్లాలనుండి ధాన్యాన్ని గాడిదలమీద చేరవేసే సాయిలు ట్రాక్టర్ల రాకతో ఉపాధి కోల్పోవడాన్ని "వలస పక్షులు" కథ వివరిస్తుంది. ఉత్పత్తిలో పాలుపంచుకునేవారి పరిస్థితే ఇలా ఉంటే, వారిపై ఆధారపడి బ్రతికేవారి పరిస్థితి మరెంతో హీనంగా మారింది. వారి గురించిన కథలు కూడ ఈ సంకలనంలో ఉన్నాయి.

కార్పొరేట్ వ్యవసాయం, కాంట్రాక్టు వ్యవసాయం దుష్ఫలితాల గురించి వివరించడానికి "కీలుబొమ్మలు" కథలో రచయిత ప్రయత్నం చేస్తాడు. పురుగుమందులు విపరీతంగా వాడటం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో కొంచెం విపరీతమయిన రీతిలోనే రచయిత వర్ణిస్తాడు. వూళ్లో నీళ్లు లేకుండాచేసేలా వాగులో ఇసుకను డబ్బులకాశపడి కంట్రాక్టుకివ్వడాన్ని ఆపడానికి, తరతరాలుగా ఆవూరి బాగుకోసం పాటుపడుతున్న కుటుంబానికి చెందిన ఓ పెద్దమనిషి చేసే విఫలయత్నం గురించి "పేగుముడి" కథ వివరిస్తుంది. ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా ఆశతో ముందుకు సాగాలనే ఆశాజీవి ముత్తయ్య కథ "ఊటబాయి". పెత్తందార్ల దాష్టీకాన్ని, దౌర్జన్యాన్ని ధైర్యంగా ఎదుర్కొంటుంది "సివంగి" కథలో పోసి. మొత్తంగా ఈ సంకలనంలోని కథలన్నీ తిరుగుబాటుతత్వాన్ని, పరిస్థితులకెదురొడ్డి నిలబడాలన్న ధైర్యాన్ని నూరిపోస్తాయి. అయితే రచయిత చెప్పినంత తేలిగ్గా ఇది సాధ్యమవుతుందా అన్న సందేహం మాత్రం కలుగుతుంది. ఏదేమయినప్పటికీ గ్రామీణజీవితంలో వస్తున్న తాజా మార్పులను, వాటి పర్యవసానాలను రచయిత సమర్థవంతంగా చిత్రించారనడంలో మాత్రం సందేహం లేదు.

- జి. వి.

స్వీకారం



నడక
రచన : అన్నవరం దేవేందర్; వెల : రు. 30/-
ప్రతులకు : 2-10-1538/2, భాగ్యనగర్, కరీంనగర్; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో.

రెండు దరుల నడుమ
వచన కవిత
రచన : చక్రవర్తి; ప్రతులకు : కృష్ణమాచార్య కళాపీఠం, డోర్ నెం. 29-9-41/1, గోవింద రాజులు నాయుడువీధి, సూర్యారావుపేట, విజయవాడ; ఎస్.సి. హెచ్. చక్రవర్తి, ఇంటినెంబర్ : 7/23, సారపాక, ఖమ్మం జిల్లా

అరిశే వెఙ్కటీయము
రచన : డాక్టర్ అరిశే వేంకటేశ్వర్లు;
వెల : రు. 30/-
ప్రతులకు : డాక్టర్ అరిశే వేంకటేశ్వర్లు, శశాంక క్లినిక్, అంబేద్కర్ నగర్, సత్తుపల్లి, ఖమ్మం జిల్లా

ప్రకృతి ప్రసాదించిన పర్యాటకకేంద్రం

కుంటాల జలపాతం

మనరాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాను ప్రకృతి ప్రసాదించిన గొప్ప పర్యాటక కేంద్రంగా చెప్పుకోవచ్చు. రాష్ట్రంలోనే ఎత్తైన కుంటాల జలపాతం, పొచ్చెర జలపాతం, దక్షిణ భారత్‌లోనే ఏకైక సరస్వతి ఆలయం, గిరిజనుల ఆరాధ్యదైవం నాగోబా ఆలయం, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నిర్మల్ పెయింటింగ్స్, వన్యమృగ సంరక్షణ కేంద్రాలు ఇలా ఆదిలాబాద్ జిల్లాలో ఎన్నెన్నో విశేషాలున్నాయి.

కుంటాల జలపాతం

ఆదిలాబాద్ పట్టణానికి 22 కిలోమీటర్ల దూరంలో నేరడికొండ గ్రామానికి 12 కిలోమీటర్ల దూరంలో ఈ జలపాతం ఉంది. ఈ ప్రాంతంలో కడెం నది 45 మీటర్ల ఎత్తు నుండి కిందగల దట్టమైన అరణ్యంలోని లోయలోకి దూకుతుంది. ఈ సుందరదృశ్యాన్ని చూడాల్సిందే గాని మాటల్లో వర్ణించడం ఎవరిశక్యం కాదు. ఈ జలపాతం రాష్ట్రంలోనే ఎత్తైనది. జలపాతానికి దగ్గర్లోనే శివుని విగ్రహం ఒకటి ఉంది. సోమేశ్వరస్వామిగా పిలువబడే శివునికి శివరాత్రి సమయాన భక్తులు పెద్దఎత్తున పూజల చేస్తారు.

పొచ్చెర జలపాతం

ఈ జలపాతం ఆదిలాబాద్ పట్టణానికి 50 కిలోమీటర్ల దూరంలో, నిర్మల్ పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో, బోథ్‌కు 8 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ప్రాంతాన గోదావరి నది పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ 20 మీటర్ల ఎత్తునుండి కిందికి దుముకుతుంది. నది ఇక్కడ చాలా వెడల్పుతో ఉండి చూడటానికి ఎంతో మనోహరంగా కనిపిస్తుంది. ఇక్కడ గోదావరి చాలా వేగంగా ప్రవహిస్తుంది.



నాగోబా దేవత

జిల్లాలోని రెండు జలపాతాలను సందర్శించడానికి శీతాకాలమే సరైనది. ఇపుడే అడవులు పచ్చగా, ఆహ్లాదకరంగా కనిపిస్తాయి.

నిర్మల్ పెయింటింగ్స్

హైదరాబాద్‌కు 250 కిలోమీటర్ల దూరంలో నిర్మల్ పట్టణం ఉంది. ఇక్కడ తయారయ్యే బొమ్మలు, పెయింటింగ్స్ ప్రపంచవ్యాపితంగా ప్రసిద్ధి చెందాయి. కొయ్యతో తయారుచేసే రకరకాలు బొమ్మలు ఎంతో అందంగా ఉంటాయి.

బాసర సరస్వతి ఆలయం

గోదావరి తీరాన ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నప్పటికీ బాసర నిజామాబాద్ జిల్లా కేంద్రానికి 50 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ గల జ్ఞాన సరస్వతి దేవాలయం దక్షిణభారతదేశంలో ఏకైక ఆలయం. మహాభారత కాలంలో వేదవ్యాసుడు ఇక్కడ సరస్వతీ విగ్రహాన్ని ప్రతిష్టించాడని అంటారు. రాష్ట్రం నుండే గాకుండా పొరుగు రాష్ట్రాల నుండి కూడా కొంతమంది తమ పిల్లలను అక్షరాభ్యాసానికి ఇక్కడకు తీసుకువస్తారు. దసరా పండుగ సందర్భంగా ఇక్కడ ఉత్సవాలు భారీఎత్తున నిర్వహిస్తారు.

కేస్లాపూర్ నాగోబా ఆలయం

ఆదిలాబాద్ పట్టణానికి 32 కిలోమీటర్ల దూరంలో, ఉట్నూరుకు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయం గిరిజనుల ఆరాధ్యదైవం. రాతిలో మలచిన నాగదేవతను గోండులు ఆరాధిస్తారు. పుష్యమాసం (డిసెంబర్ లేదా జనవరి)లో పండుగకు కుల, మతాలకు అతీతంగా పెద్దఎత్తున ప్రజలు హాజరవుతారు. మహారాష్ట్ర నుండి అత్యధికంగా వస్తారు.

జలపాతాలు, ఆలయాలే గాకుండా జిల్లాలో మంచిర్యాల కేంద్రంగా మూడు వన్యమృగ సంరక్షణ కేంద్రాలు ఉన్నాయి. దట్టమైన అడవుల్లో పులులు, జింకలు సహా రకరకాల వన్యమృగాలు కనువిందు చేస్తాయి. ఆదిలాబాద్, నిర్మల్, ఉట్నూరు, బాసర తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ శాఖల అతిథిగృహాలు, హోటళ్ళు పర్యాటకులకు వసతి కల్పిస్తున్నాయి. ●



బాసర సరస్వతీ దేవి

✻ సోమంచి శ్రీవాగ్దేవి

పిల్లల పుస్తకాలు రాసే పెద్దరచయిత సర్వేశ్వర శర్మ

డిసెంబర్ 10న గుంటూరులో మంగాదేవి బాలసాహిత్య పురస్కారంగా పదివేల రూపాయల నగదు, జ్ఞాపిక అందుకోబోతున్న సందర్భంగా సర్వేశ్వర శర్మ ప్రత్యేక పరిచయ వ్యాసం.

బాల్యస్థితిలోనే పిల్లల్లో శాస్త్రీయ దృక్పథం ఏర్పడాలనే ఆలోచనతో, వారిలోని ప్రతిభను తట్టిలేపాలనే ఆశతో, చిన్నారుల సృజనాత్మక శక్తికి చైతన్యం కల్గించాలనే ధోరణితో తనదైన శైలిలో సైన్సు అంశాలపై రచనలు విశేషంగా చేసిన రచయిత సి.వి.సర్వేశ్వరశర్మ.

తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలోని ఎస్.కె.బి.ఆర్. కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకునిగా, రీడర్‌గా దాదాపు నలభై సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో ఉండి మూడేళ్ళ క్రితం పదవీ విరమణ చేశారు.

రచయితగా ఈ మూడేళ్ళలో పిల్లల కోసం ఎన్నెన్నో సైన్సు పుస్తకాలు రాశారు. దేనికదే ప్రత్యేకంగా వుంటుంది. అమ్మా, నాన్నలను డబ్బులు అడగకుండా ఉపాధ్యాయుల సహకారంతో ఇంట్లో పనికిరాని వస్తువులతో కొత్తకొత్త సైన్సు పరికరాలు ఎలా తయారు చేయవచ్చునో తెలియజెప్పే 71 సైన్సు ఎగ్జిబిట్స్ ఇటీవల బాలల కోసం రాసిన ఒక పుస్తకం.

సైన్స్ ఫ్లాష్, సైన్స్ టచ్ :

పిల్లల్లో ఎన్నో ఆసక్తికరమైన సందేహాలు వస్తూ ఉంటాయి. వాటికి కచ్చితమైన సమాధానాలు తెలిస్తే వారి ఆలోచనలు శాస్త్రీయంగా అభివృద్ధి చెందుతాయి. నిరాధారమైన ఊహలతో కూడిన జవాబులు పిల్లల ఆలోచనా శక్తిని తప్పు త్రోవను పట్టిస్తాయని గుర్తు చేస్తూ వంద ఆసక్తికరమైన సందేహాలకు సచిత్రమైన జవాబులు రాశారు సైన్స్‌ఫ్లాష్ పుస్తకంలో.

దైనందిన జీవితంలో అనేక సంఘటనల వెనుక దాగివున్న శాస్త్రీయ వివరణలు పిల్లలకు తెలిస్తే సంఘటనలను పరిశీలించడం, విశ్లేషించడంలో వారి చాతుర్యం పెరుగుతుందనే ఉద్దేశంతో సైన్స్‌టచ్ పుస్తకం రాశారు. ఇందులో వంద సంఘటనల గురించిన సచిత్ర శాస్త్రీయ వివరణ ఉంది. ఈ రెండు పుస్తకాలలోని ప్రతిఅంశం ఎంతో ఆకర్షణీయంగా, మనసులో ముద్రపడే విధంగా రాయడం ఒక ప్రత్యేకత. ఈ పుస్తకాలు విశేషంగా జనాదరణ పొందాయి.

మనిషి పగటిపూట ఒక సెంటీమీటరు పొట్టిగా ఉంటాడు ఎందుచేత? చేతివేలిగోళ్ళు పెరిగినంత స్పీడుగా కాలిగోళ్ళు పెరగవు కారణం ఏమిటి? సైకిల్ ముందు ఫోర్కు వంకరగా ఉంటుంది ఎందుచేత ? వంటి ప్రశ్నలకు జవాబులు మాత్రమే గాక ఇంకా సైన్సు పరిశోధనలలో అసంపూర్తిగా వున్న అంశాలు కూడా రాశారు సైన్స్ ఫ్లాష్‌లో.

మగవారు గెడ్డం గీసుకునేటప్పుడు సబ్బు ఎందుకు రాసుకుంటారు ? టెస్ట్‌ట్యూబ్ బేబీలు ఎక్కువగా ఆడపిల్లలే ఎందువల్ల? ఎక్కువ తిండి తినే మనిషి తక్కువ బరువు, తక్కువ తిండితినే మొసలి ఎక్కువ బరువు ఉంటుంది కారణం ఏమిటి? వంటి సంఘటనలకు వివరణలు సైన్స్ టచ్‌లో ఉన్నాయి.

జాతీయ బహుమతులు :

'మన శరీర సంపదలు' అనే సైన్సు వచన కావ్యం రాసినందుకు 1991లో సర్వేశ్వర శర్మకు బాలసాహిత్యంలో జాతీయ బహుమతి లభించింది. మనిషి శరీరంలో ప్రతి

మందిర్ మస్జిద్

కవితేదో వ్రాయాలని
కలము చేత బూనుకొనగా
మత రక్తపు మరకలతో
మసక బారె నయన ద్వయము

కలము నాపి తలను వేసి
పరిస్థితిని పరికించగా
పాతగోడ పంచాయితి
ప్రతి చోటికి ప్రాకి యుండె

రామాయని కొలుచు వాడు
అల్లాయని తలచువాడు
భక్తి మరచి రక్తి విడచి
రణము సల్పబూను కొనిరి
హరి హరి యని ఒరిగెనొకడు
అల్లాయని కూలెనొకడు
దైవం కళ్ళప్పగించి
ఇరు శవాల చూచుచుండె
అసువులు బాసిరి కొందరు
అంగ వికలురైరి కొందరు
అన్నెం పున్నెం ఎరుగని
అతివలేమొ వితంతులైరి
దైవస్థల రక్షణపేర
ఇద్దరు బలిపశువులైరి
దైవమేమొ ఏ ఒక్కరిని
కాపాడగ లేక పోయె.

'వీరపురుషులు' అమరపురికి
చేరినారో లేదో గాని
వారి సతుల, సుతుల బ్రతుకు
నరకానికి చేరుకొనియె.
అందుకే నేనంటాను
దైవం దివిన ఉంటే
భువిని కట్టడా లేల
కట్టడాల పేర మనం
కాటికి మరి చేరనేల

జాలిని నిలువున చీల్చే
మతం రంపం మనకొద్దు
అందరిని ఐక్యపరిచే
మానవతే మనకు ముద్దు
మతం మనకు గతం మాట
మనిషి తనం నేటి బాట
హిందూ, ముస్లింలం
సాగుదాం అదే బాట



– సదుర్ల గోపాల్


అప్పటి రాష్ట్రపతి డాక్టర్ శంకర్ దయాళ్ శర్మ నుండి అవార్డు అందుకుంటూ...

అవయవం విశిష్టతను కవిత్వంగా పిల్లలకు మనసులో గుర్తుండిపోయే విధంగా సచిత్రంగా రాసిన పుస్తకం.

'కొత్తశక్తి జనకాలు' అనే మరొక పుస్తకం రాసినందుకు 1985లోను, 'శాస్త్రీయ విజ్ఞానంతో వ్యవసాయం' అనే పుస్తకం రాసినందుకు 1987లో జాతీయ బహుమతులు సర్వేశ్వర శర్మకు లభించాయి.

ఈయన రాసిన సైన్స్ నాటిక 'పరిష్కారం' రాష్ట్ర ప్రభుత్వం ఏడవ తరగతి తెలుగు వాచకంలో ఒక పాఠంగా ముద్రించింది. నవంబర్ 20న దీనిని అత్యంత రసవత్తరంగా దూరదర్శన్ చిత్రీకరించి ప్రసారం చేసింది.

అంతరిక్షం అంటే ఏమిటి? ప్రపంచ దేశాలన్నీ పోటీపడి అక్కడకు ఎలా వెళుతున్నాయి? ఎందుకు వెళుతున్నాయి ? అడుగడుగునా ఎంతో ఆసక్తి, విజ్ఞాన దాయకంగా ఉండే విధంగా సాగిన అద్భుత రచన 'అంతరిక్ష విజ్ఞానం' గ్రంథం. మహారాష్ట్ర ప్రభుత్వం ఈ గ్రంథంలోని అధ్యాయం 'భారతదేశం – అంతరిక్షం'ను తమ పదవ తరగతి తెలుగువాచకంలో ఒక పాఠంగా ముద్రించుకుంది.

పలు గ్రంథాల రచయిత :

ఆకాశవాణి విజయవాడ, కడప, హైదరాబాద్, విశాఖపట్టణం కేంద్రాల నుండి బాలల కోసం ప్రత్యేకంగా సర్వేశ్వరశర్మ రాసిన సైన్స్ సీరియల్స్ విశ్వదర్శనం, జనవిజ్ఞాన దర్శిని, బాల విజ్ఞాన దర్శిని, విజ్ఞాన వేదికలు రేడియోశ్రోతలను 1980 దశకంలో విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇవన్నీ గ్రంథాల రూపంలో వెలువడ్డాయి.

సర్వేశ్వర శర్మ రచనా శైలి ఎంతో సులభంగా ఉండి ఎంతటి క్లిష్టతరమైన సంగతినైనా అందరికీ తేలికగా అర్థమయ్యేటట్లు రాయగలరు. ఇప్పటికి మొత్తం 75 పాపులర్ సైన్స్ గ్రంథాలు రచించారు.

బాలసాహిత్యంలో ఈయన రాసిన మరమనిషి కథలు ఒక కొత్త ఒరవడి సృష్టించాయి. బాలలను ఆకట్టుకునే కథల్లో చిన్న సైన్సు ముడివేసి దానిని ఆ తరువాత విప్పడం ఈ కథల్లో ఒక ప్రత్యేకత. ఒక రిక్షావాలా 'మంచు' ముక్కలు ఉపయోగించి బీడి వెలిగించుకుంటాడు. ఎలా? కథ చదివిన ప్రతి పాఠకుడు పదిమందికి చెప్పేలా రాశారు రచయిత.

రాష్ట్ర ప్రభుత్వం సర్వేశ్వర శర్మను ఆరు నుండి పదవ తరగతి సైన్సు పాఠ్య పుస్తక రచయితగా నియమించి ఆయన సేవలను వినియోగించుకుంది. తెలుగులో నాలుగువేల సైన్సు వ్యాసాలు రాసి దిన, వార, మాస పత్రికల పాఠకులకు కూడా సుపరిచితులయ్యారు.

కోనసీమ సైన్సు పరిషత్ :

1984లో కోనసీమ సైన్సు పరిషత్‌ను ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికి అనేక ప్రదేశాల్లో 950 కోనసీమ సైన్సు పరిషత్ మహాసభలు స్వచ్ఛందంగా నిర్వహించిన ఒక నిరంతర సైన్సు యాజ్ఞికుడు సర్వేశ్వర శర్మ.

ఆయన సైన్సు ఉపన్యాసం ఒక సమ్మోహనాస్త్రం. బాలలే కాదు, పెద్దలు కూడా ఆదమరచి ఆయన సృష్టించే సైన్సు ప్రపంచంలో మునిగిపోతారు. ఆయన ఉపన్యాసంలో పిల్లల్ని భాగస్వాములను చేసి అప్పటికప్పుడు పిల్లలచేత వేదికపై సైన్సు ఉపన్యాసాలు ఇప్పించే సమర్థుడు.

మూఢనమ్మకాల ముసుగులో మనిషి నలిగిపోకుండా బాల్య స్థితిలోనే శాస్త్రీయంగా ఆలోచించే అలవాటు పిల్లలకు ఉండాలనేది సర్వేశ్వరశర్మ సంకల్పాలలో ముఖ్యమైనది.

అవార్డులు–బిరుదులు :

సైన్సు సేవలకు మద్రాసు తెలుగు అకాడమీ 'ఉగాది పురస్కార్–2000'తోను, లోక్‌సభ స్పీకర్ జి.ఎం.సి.బాలయోగి 'విప్లవజ్యోతి అవార్డు'తోను, దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు గారి 'విశ్వదాత' అవార్డుతోను, విశాఖ సమాచారం దినపత్రిక 'ఉగాది పురస్కార్' అవార్డుతోను సత్కరించాయి.

కోనసీమ ప్రజలు 2001 జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా సర్వేశ్వర శర్మను రజిత కిరీటాలంకృతుడిని చేసి సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం 1999లో 'బెస్ట్ టీచర్' అవార్డుతో గౌరవించింది. విశాఖ పట్టణంలో 13 ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ఆయనను 1998 డిసెంబర్ 13న 'సైన్స్ చక్రవర్తి' బిరుదు ప్రదానం చేసి సత్కరించాయి.

సమ్మె ఎట్ల తప్పు



పల్లవి :

సమ్మె ఎట్ల తప్పు
జవాబు మాకు చెప్పు
లోకమందు ప్రతి జీవి
ఆయుధంగా వాడుతుంది

తొట్టిలోన చంటిపాప
పక్క తడిపినపుడు
మార్చే వరకు సమ్మె చేసి
గుక్క పెట్టి ఏడుస్తుంది ॥సమ్మె॥

దాన కుడితి పెట్టకుండ
బర్రెపాలు పిండబోతె
నోరులేని జంతువైన
ఎగిరి మనల తన్నుతుంది ॥సమ్మె॥

కాకికి దెబ్బతాకి
కావు కావు మనంగానె
ఎక్కడున్న కాకులైన
ఒక్కచోట చేరుతాయి ॥సమ్మె॥

ప్రేమగుంటె కుక్కపిల్ల
మురక సూసి ముద్దు పెట్టు
కట్టెతోటి కొట్టినపుడు
కయ్యిమంటు కాలుకొరుకు ॥సమ్మె॥

చెట్టు చెట్టు తిరిగి తిరిగి
తేనెపట్టు పెట్టినపుడు
తియ్యబోతె ఈగలన్ని
కుట్టికుట్టి చంపుతాయి ॥సమ్మె॥

తలుపులన్ని మూసేసి
పిల్లిని మనం కొడుతుంటే
పోయేదారి లేకపోతే
మెడపట్టి కొరుకుతుంది ॥సమ్మె॥

పిల్లి నుండి పిట్టవరకు
బతుకు పోరు న్యాయమైతే
కార్మికుల సమ్మె హక్కు
అవుతుంది జన్మహక్కు ॥సమ్మె॥

– స్ఫూర్తి

ADVOCATE

న్యాయసలహాలు

నాకు ఫించన్ వస్తుందా?

నా వయస్సు 18 సంవత్సరాలు. మా నాన్నగారు గవర్నమెంట్ ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. పింఛన్ పొందుతున్న మా నాన్నగారు 9-3-2001న మరణించారు. అంతకుముందే మా అమ్మగారు కూడా మరణించి నందున మా నాన్నగారి పింఛనుకై పెళ్ళికాని నేను ఫ్యామిలి పింఛను కోసం నా సర్టిఫికెట్స్ డాక్యుమెంట్స్ హైదరాబాద్ ఎ.జి. ఆఫీసుకు పంపియున్నాను. సంవత్సరం క్రితం నా దరఖాస్తును పరిశీలించామని తెలుపుతూ హైదరాబాద్ ఎ.జి. నుండి ఒక కాగితం వచ్చినది కాని ఇంతవరకూ మా నాన్నగారి పింఛను తాలూకూ ఆర్డర్స్ పంపించలేదు. నేను అనారోగ్యం, పేదరికంతో బాధపడుతున్నాను. మా నాన్నగారి పింఛన్ నేను పొందడానికి వీలువుతుందా ? తెలుపగలరు.

– పి.వనజ, విజయనగరం

తండ్రి ప్రభుత్వోద్యోగం చేసి రిటైరై మరణిస్తే, తల్లి కూడా అప్పటికే మరణించి ఉంటే ఆ కుటుంబంలోని పిల్లల్లో ఒక్కరికి 25 సంవత్సరాల వరకు అనాధ ఫించన్ వస్తుంది. కుమార్తె ఒక్కరే ఉండి అవివాహిత అయివుంటే 25 సంవత్సరాలు వచ్చేవరకు ఫించన్ పొందడానికి అర్హురాలు అవుతుంది. అదే వికలాంగులైతే జీవితాంతం ఫించన్ ఇస్తారు.

ఒక్కరు చేసిన తప్పుకు అందరూ బాధ్యులేనా?

ఒక పార్టనర్‌షిప్ ఫరంలోని ఒక పార్టనర్, ఫరం యొక్క ఫర్ స్టాంపు వేసి సంతకం చేసి నగదుగా తీసుకొన్న సొమ్ము సొంత ప్రయోజనాలకు వాడుకుంటే ఆ సొమ్ముకు ఫరం గాని, మిగిలిన పార్టనర్స్ గాని ఎంతవరకు జవాబుదారి అవుతారు. ఈ సమస్యపై తగిన సలహా ఇవ్వవలసిందిగా కోరుతున్నాను.

– జి.సత్యనారాయణ, ఆకివీడు.

పార్టనర్‌షిప్ సంస్థలో ఒక పార్టనర్ తీసుకున్న సొమ్ము పుస్తకంలో జమచేయకపోతే ఆ పార్టనర్‌పైన చట్టపరంగా చర్య తీసుకోవచ్చు. అయితే ఎవరైతే ఆ సొమ్మును పార్టనర్‌షిప్ సంస్థకు ఇచ్చారో వారి ప్రయోజనాలు కాపాడాల్సిన బాధ్యత కూడా సంస్థకు ఉంటుంది.

మీరు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయవాదులు సలహాలు ఇస్తారు. ఈ సమస్యలతో సతమతమయ్యే పాఠకులు తమ ప్రశ్నలను ప్రజాశక్తికి పంపిస్తే వీలువెంబడి న్యాయవాదుల సమాధానాలు ప్రచురిస్తాము.

చిరునామా :

న్యాయసలహాలు
ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం. 1,
అశోక్‌నగర్, హైదరాబాద్ - 20

కంపెనీ మోసం చేసింది

నేను ఒక ప్రైవేటు, కాటన్ జిన్నింగ్ మిల్లులో 10 సంవత్సరాలు పని చేసి వున్నాను. తరువాత ఆ కంపెనీలో మానివేసినాను. 1990 సంవత్సరం ఆ కంపెనీ యాజమాన్యం నా పేరు పి.ఎఫ్.లో రాయించింది. ఇప్పుడు యాజమాన్యం దగ్గరకు వెళ్ళి నాకు పి.ఎఫ్. ఇప్పించండి అని అడిగితే, పి.ఎఫ్. ఆఫీసరునకు ఏదో ఫార్మాలిటీ కోసం నీ పేరు చెప్పాము, అంత మాత్రాన నీకు పి.ఎఫ్. డబ్బులు ఇప్పించాలా? నీ దగ్గర ఏమన్నా డబ్బులు పి.ఎఫ్.నకు మేము పట్టుకున్నామా అని అడిగారు. యూనియన్ పెద్దలు నీ దగ్గర కటింగ్ చేసినా చేయకపోయినా నీవు అన్ని సంవత్సరాలు ఆ కంపెనీలో పని చేసినావు కాబట్టి వెళ్ళి పి.ఎఫ్. ఆఫీసులో అడుగు అన్నారు. పి.ఎఫ్. ఆఫీసులో అడిగితే, మీ యాజమాన్యం దగ్గరకు వెళ్ళి నెంబరు తెచ్చుకుంటే తప్ప ఉపయోగం ఉండదన్నారు. 1990 సంవత్సరంలో నా చేత సంతకం పెట్టించుకున్నారు. 89/90/91 ఈ మూడు సంవత్సరములు ఒక పార్టీ ఆ కంపెనీలో, ఓచర్స్ మీద సంతకాలు పెట్టించుకున్నారు. ఆ తరువాత వచ్చిన పార్టీ వాళ్ళు ఓచర్లే వాడలేదు. ఆ కంపెనీలో నేను పని చేసినట్లు అంతకంటే రుజువు ఏమీ లేదు. నేను పేదరికంతో బాధపడుతున్నాను. నాకు పి.ఎఫ్. డబ్బులు వస్తాయంటారా. నేను కోర్టుకు వెళ్ళవచ్చా, కోర్టుకు వెళితే డబ్బులు ఎంత ఖర్చు అవుతాయి. లేబర్ ఇన్స్‌పెక్టర్ గారి దగ్గరకు వెళితే న్యాయం జరుగుతుందా? మీ న్యాయ సలహా కోసం ఎదురు చూస్తూ ఉంటాను.

– శ్రీనివాస్,

మీరు పనిచేసిన కంపెనీ యాజమాన్యం మీ పేరుతో ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయంలో అక్కౌంట్ ప్రారంభించలేదని మీ ప్రశ్నను బట్టి అర్ధమవుతోంది. మీ అక్కౌంట్ నంబర్ అధికారయుతంగా తెలిస్తేనే మీకు దాని నుండి సొమ్ము అందే అవకాశం ఉంది. కాని మీ కేసులో అటువంటిది జరగలేదు. ఒకవేళ మీ యాజమాన్యం మిమ్మల్ని మోసం చేసి ఉంటే సంబంధిత లేబర్ అధికారులకు మీ యూనియన్ ద్వారా ఫిర్యాదు చేయండి. దానివల్ల మీకు ప్రయోజనం కలుగవచ్చు.

– ఎ.సత్యప్రసాద్,
హైకోర్టు న్యాయవాది



సున్నుండలు

కావలసిన వస్తువులు:

మినపగుళ్ళు: 1 కి.గ్రా

చక్కెర: పావుకిలో

బెల్లం: కిలో

పుట్నాలు: పావు కిలో

కొబ్బరి: పావు కిలో

ఏలకులు: ఐదు లేక ఆరు

నెయ్యి: కిలో

చేసే విధానం:

చేయవలసిన విధానం: ముందుగా మినపగుళ్ళు పచ్చిగా లేకుండా వేయించుకోవాలి. వాటిని చక్కెరతో కూడా కలిపి కొంచెం బరకగా పిండి పట్టించాలి. పుట్నాలు, కొబ్బరి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. బెల్లం మెత్తగా దంచి మిక్సీ జార్‌లో కొంచెం కొంచెం మినప సున్నితో కలిపి పట్టుకోవాలి. ఇప్పుడు పుట్నాల పొడి, కొబ్బరి పొడి ఇందులో కలుపుకోవాలి. ఏలకులను కూడా మెత్తగా నూరి అందులో కలపాలి. ఈ మొత్తం మిశ్రమంలో నెయ్యి కలిపి ఉండలుగా కట్టుకోవాలి. మినప సున్నిని నిల్వ ఉంచుకొని అవసరమైనప్పుడు ఉండలు చేసుకుంటే తాజాగానూ, రుచిగానూ ఉంటాయి.

చివడా (అటుకులు)

కావలసిన వస్తువులు:

మందంగా ఉండే అటుకులు: పావు కిలో

వేరుశనగ గుళ్ళు: 50 గ్రాములు

పచ్చి శనగపప్పు: ఒక స్పూను

మినపప్పు: ఒక స్పూను

ఆవాలు: అర స్పూను

జీలకర్ర: అర స్పూను

పచ్చి మిరపకాయలు: రెండు

నూనె: రెండు స్పూన్లు

కరివేపాకు: రెండు రెమ్మలు

చేసే విధానం: ముందుగా అటుకులను బియ్యం కడిగినట్టుగా రెండు సార్లు కడగాలి. నీళ్ళను పూర్తిగా వంచేయాలి. వీటిని ఓ పావుగంట అలాగే ఉంచాలి. ఇప్పుడు అందులో పలుకు లేకుండా నానాయో లేదో చూసుకోవాలి. పలుకు ఉంటే వాటిపై కొద్దిగా నీళ్ళు చిలకరించాలి. ఇప్పుడు బాణలిలో నూనె వేసి కాగిన తరువాత వేరుశనగ పప్పులు వేయాలి. అవి కొంచెం వేగగానే పచ్చిశనగ పప్పు, మినపప్పు వేసి వేయించాలి. ఆవాలు, జీలకర్ర, కరివేపాలు, పచ్చి మిరపకాయ ముక్కలు వేసి వేగిన తరువాత నానబెట్టుకున్న అటుకులు వేసి రెండు నిముషాలు ఉంచాలి. అందులో తగినంత ఉప్పు వేయాలి. తీపిగా ఇష్ట పడేవారు నాలుగు స్పూన్లు పంచదార వేసి ఒక నిముషం ఉంచి దించాలి. తీపి ఇష్టంలేని వారు నిమ్మరసం పిండుకొని తినవచ్చు.ఇది వేడివేడిగా తింటే బావుంటుంది.

ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించేది
రైతాంగ సమస్యలకు పరిష్కారం చూపించేది

మన
రైతువాణి
మాసపత్రిక

సంవత్సర చందా
రూ. 100/-
చందాదారులు కండి.
2004 మన రైతువాణి డైరీ, క్యాలెండర్ ఉచితంగా పొందండి.

వ్యవసాయరంగ సంక్షోభానికి, రైతు నష్టాలకు కారణాలను విశ్లేషించి పరిష్కారాన్ని చూపేది
మన **రైతువాణి**

సంవత్సర చందాదారులకు మాత్రమే ఈ అవకాశం.

చందా మొత్తాన్ని మీకు దగ్గరలోని రైతు సంఘం ప్రతినిధులకు గాని, రైతు సంఘం కార్యాలయాలలోగాని చెల్లించండి.
పోస్టుద్వారా పొందగోరువారు రూ. 136 లు పంపాలి.

మా చిరునామా

మన రైతువాణి, 1-1-9/10, జవహర్‌నగర్, ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్, హైదరాబాద్ - 500 020

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రచురిస్తున్న రైతుల పత్రిక